



● ఫెంగల్ ఎఫెక్ట్.!

తిరుచానూరు మాడవీధుల్లో సింహ వాహన సేవ రద్దు

వాహన మండపం నుంచే పద్మావతీ దేవి దర్శనం !

తిరుచానూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతీ దేవి కార్తీక బ్రహ్మోత్సవాలపై ఫెంగల్ తుపాను ప్రభావం పడింది. శనివారం ఉదయం నుంచి జడివాన కురుస్తుండడంతో రాత్రి తిరుమాడవీధుల్లో జరగాల్సిన సింహవాహన సేవను వాహన మండపానికే పరిమితం చేస్తున్నట్లు టీటీడీ ప్రకటించింది. సాయంత్రం ఆలయంలోని కేటీమండపంలో ఊంజల్ సేవ జరిగాక అమ్మవారిని వాహన మండపానికి తీసుకొచ్చి పట్టుపీతాంబర, వజ్రవైఢూర్య, స్వర్ణాభరణాలతో యోగనరసింహుడి అలంకారంలో సింహవాహనంపై కొలువుదీర్చారు. వాహన మండపం నుంచే భక్తులకు దర్శనమిచ్చారు. మాడవీధుల్లో వేచివున్న భక్తులు వాహన మండపానికి చేరుకుని కర్పూర, నారికేళ హారతులు సమర్పించారు. వర్షం కారణంగా సాయంత్రం నుంచే విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో ఆలయ పరిసరాలు చీకటిమయంగా మారిపోయాయి.వాహన సేవ ముందు సాంస్కృతిక ప్రదర్శనలకోసం వచ్చిన ఎస్వీ సంగీత, నృత్య కళాశాల విద్యార్థులు నిరుత్సాహపడడంతో వారికి మహతిలో జరుగుతున్న సాంస్కృతిక కార్యక్రమాల్లో అవకాశం కల్పించారు.



వాహనమండపంలోనే అమ్మవారికి భక్తుల హారతులు

సంచార జాతులా.. లేరే!

సీడ్ సర్వేలో అధికారుల సమాధానం

● లబ్ధిదారుల్ని గుర్తించడంలో అలసత్వం

● కొన్ని మండలాల్లో ఇంకా ప్రారంభమే కాని సర్వే



ఈ ఫొటోలో కనిపిస్తున్న మురుగమ్మ, వెంకటేశులు దంపతులకు ఓ కొడుకున్నాడు. యాదమరిలోని చెన్నారెడ్డిపల్లి ధర్మరాజుల గుడిలో నివాసం. వంట, స్నానం, తినడం, పడుకోవడం.. అంతా ఆరుబయటే. పలమనేరు, కుప్పం ప్రాంతాల్లో తిరుగుతుంటారు. వేడుకల్లో పక్క పిన్నులు, బెలూన్లు అమ్ముకుంటారు. మళ్లీ ఇక్కడికే వచ్చేస్తారు. వీళ్లని పిన్నుదాసర్లు అంటారు. వీరిది సంచార జీవనం. చెన్నారెడ్డిపల్లె చుట్టుపక్కల *50* నుంచి *60* కుటుంబాల సంచార జాతులవారున్నారు. పాములు పట్టడం, భిక్షాటన చేయడం వంటి పనులు చేస్తున్నారు. పక్కా గృహాలను మంజూరు చేసినా ఆర్థిక స్తోమత లేక నిర్మించుకోలేదు.

సంచార జాతులంటే స్థిరంగా ఒక దగ్గర ఉండకుండా తిరుగుతూ ఉండే జనం. ఏడాదిలో కొంత కాలం పాటూ ఒక తావులో ఉండి, వివిధ ప్రాంతాలు తిరిగి వచ్చే వారిని అర్ధ సంచారులు అంటారు. ఇటువంటి వారికి స్థిర నివాసాలు కల్పించడం, వారి సంక్షేమానికి కృషి చేయడం కోసం కేంద్రప్రభుత్వం 'సంచార జాతుల ఆర్థిక సాధికారతా పథకం'(సీడ్)ను ప్రవేశపెట్టింది. రాష్ట్రప్రభుత్వంతో కలిసి ఈ పథకం అమలు మొదలైంది. ఇందుకోసం లబ్ధిదారులను గుర్తించడానికి జిల్లావ్యాప్తంగా సంచారజాతుల సర్వే జరుగుతోంది. పేరుకు సర్వేనే కానీ ఇది తూతూ మంత్రంగానే జరుగుతోంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని అనేక మండలాల నుంచి 'మా దగ్గర ఇటువంటి వారు లేరు' అనే సమాధానం వస్తోంది. నిజానికి ఊళ్లలో పట్టణాల్లో, ఉత్సవాల్లో సంచార జాతుల జనం కనిపిస్తూనే ఉన్నారు. మరి వీరంతా సర్వే పరిధిలోకి ఎందుకు రావడం లేదనే అనుమానం అధికారుల్లో కలుగుతోంది.

చిత్తూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు అక్టోబరు 18న ఉమ్మడి జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి సర్వే సూచనలు పంపించారు. ఈ నెల 4న మరోసారి కలెక్టర్ సుమిత్‌కుమార్ సర్వేకి సంబంధించిన సూచనలతో ఆదేశాలు జారీ చేశారు.మండలాల్లో ఎంపీడీవోలు, మున్సిపాలిటీల్లో కమిషనర్లు బాధ్యత వహించి సచివాలయ ఉద్యోగులతో సర్వే చేయించాలి. అయితే నెల దాటినా తిరుపతి, చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్లు సహా చాలా మండలాల్లో ఈ సర్వే ప్రారంభమే కాలేదు. మరికొంతమంది ఎంపీడీవోలు 'మా మండలంలో సంచార జాతులు లేవు' అని మొక్కుబడిగా నివేదిక ఇచ్చేశారు. ఇలా 8 మండలాల నుంచి వచ్చిన నివేదికలను జిల్లా అధికారులు వెనక్కి పంపించేశారు. ఇంకొంతమంది ఎంపీడీవోలకు అసలు ఈ సర్వే గురించి కనీస అవగాహన లేదు. జిల్లాలో సంచార జాతులవారు 85,436మంది ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అలాగే ఇతర జాతుల నుంచి సంచార జాతుల్లోకి వచ్చినవారు 36,716 మంది ఉన్నారు.వీరిలో నుంచి సీడ్ పథకానికి అర్హుల్ని గుర్తించాలి.అయితే ఇప్పటి దాకా పెనుమూరు మండలంలో 23మందిని, వెదురుకుప్పంలో 86మందిని, చౌడేపల్లెలో 160మందిని, పెద్దపంజాణిలో 18మంది లబ్ధిదారుల్ని మాత్రమే గుర్తించారు. శాంతిపురం, నగరి, కుప్పం మున్సిపాలిటీ, ఎస్‌ఆర్‌పురం, గుడుపల్లె మండలాల్లో లబ్ధిదారులు ఎవరూ లేరని అక్కడి అధికారులు చెబుతున్నారు. ఇక యాదమరి, పులిచెర్ల, తవణంపల్లె, ఐరాల, పలమనేరు తదితర మండలాల్లో అయితే ఇంకా సర్వే మొదలుకాలేదు.

ఎందుకిలా?

సంచార జాతుల సర్వే చేయడం అంత సులువు కాదు. ఇందుకు సర్వే సిబ్బందికి తగిన శిక్షణ ఇవ్వాలి. వీరు స్థిరంగా ఒక తావులో ఉండరు. వెతుక్కుంటూ వెళ్లాలి. సాధారణంగా పట్టణాల శివారు ప్రాంతాల్లో గుడారాలు వేసుకుని ఉంటారు. ఉదయాన్నే నిద్ర లేచి పల్లెల్లోకి, పట్టణంలోకి వెళ్లిపోతారు. సిబ్బంది వెళ్లి పలకరించగానే వీరు తమ సమాచారం చెప్పరు. కొన్ని సంచార తెగల మీద దొంగలు, వ్యభిచారులు అనే ముద్ర వేయడం వల్ల వీరు తమ జాతిపేరు చెప్పడానికి ఇష్టపడరు. చాలామంది మరాఠీలో మాట్లాడుతారు. లేదా మనకు అర్థం కాకుండా ఒక సంకేత భాషలో మాట్లాడుకుంటారు. నమ్మకం కలిగేలా వారితో ఓపికగా వ్యవహరించగలగాలి.

సీడ్ ద్వారా నాలుగు రకాల లబ్ధి

- ఇంటర్, డిగ్రీ పూర్తి చేసినవారికి ఉన్నత చదువుల కోసం, ఉద్యోగాల కోసం శిక్షణ తీసుకునేందుకు ఆర్థిక సాయం అందుతుంది.
- ఇల్లు లేనివారికి గృహ నిర్మాణ పథకం ద్వారా ఇల్లు నిర్మించి ఇస్తారు.
- చిరు వ్యాపారాలు చేసుకునేందుకు 10 లేదా 20 మందితో గ్రూపుల్ని ఏర్పాటుచేసి ఆర్థిక సాయం చేస్తారు.
- రూ.5 లక్షల హెల్త్ ఇన్సూరెన్సు కల్పిస్తారు.



పెద్దపంజాణి మండలం వీరప్పల్లిలో సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది

జగన్ ప్రభుత్వం వీరిని గాలికొదిలేసింది

2014-19 మధ్యలో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం సంచార జాతుల సంక్షేమం కోసం ప్రత్యేక దృష్టి సారించింది. అత్యంత వెనుకబడిన కులాల (ఎంబీసీ) కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసింది. ఆయా కులాలకు సంబంధించిన సర్వే, అధ్యయనం చేసింది. 32 కులాలను సంచార, విముక్త జాతులుగా గుర్తించింది.ఒక్కో కుటుంబానికి రూ.30 వేల ఆర్థిక సాయం చేసింది. 90శాతం రాయితీతో రుణాలు అందించింది. స్వయం ఉపాధి యూనిట్లను నెలకొల్పింది. ఓబీసీ కార్పొరేషన్‌కు 2017-18 బడ్జెట్‌లో రూ.60 కోట్లు, 2018-19లో రూ.వంద కోట్లు, 2019-20లో రూ.60 కోట్లను కేటాయించింది.వైసీపీ అధికారంలోకి రాగానే సంచార జాతుల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేసింది. ఓబీసీ కార్పొరేషన్‌కు టీడీపీ ప్రభుత్వం 2019లో కేటాయించిన బడ్జెట్ నిధుల్లో నుంచి రూ.10 కోట్లను ఖర్చు చేసింది. ఆ 32 కులాల వారికి నవరత్నాలను అందించలేదు.

15 రోజుల్లో సర్వే పూర్తి



సీడ్ పథకం సంచార జాతుల వారికి వరం లాంటిది. అర్హులకు పెద్దఎత్తున లబ్ధి కలగనుంది. అర్హుల్ని గుర్తించే సర్వే గత నెలలోనే ప్రారంభించాం. 15 రోజుల్లో సర్వే పూర్తయ్యేలా ఫాలోఅప్ చేస్తున్నాం. నివేదికను రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్రానికి పంపిస్తే.. లబ్ధి మంజూరవుతుంది.

- శ్రీదేవి, బీసీ కార్పొరేషన్ ఈడీ, ఉమ్మడి చిత్తూరు జిల్లా

స్వర్ణమ్మకు హారతులు



స్వర్ణముఖి నదీమతల్లికి హారతులిస్తున్న వేదపండితులు



గంగాదేవికి పూజలు



శ్రీకాళహస్తి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి):కార్తీక మాసం అమావాస్యను పురస్కరించుకుని శ్రీకాళహస్తిలో శనివారం సాయంత్రం స్వర్ణమ్మకు హారతుల సమర్పణ వేడుకగా జరిగింది.పవిత్ర నదిలో గంగా హారతులను దర్శించుకున్న జనం భక్తి పారవశ్యంతో తన్మయత్వం చెందారు. స్వర్ణముఖి నదిలోని సద్యోముక్తి ప్రదేశం వద్ద హారతులు సమర్పించారు.అంతకుముందు ముక్కంటి ఆలయంలో గంగాదేవి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి స్వర్ణముఖి నదిలోని సద్యోముక్తి ప్రదేశం వరకు మంగళవాయిద్యాలు, మేళతాళాల నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చి కొలువుదీర్చారు. పండితులు వేదోక్తంగా నదీజలాలకు, అమ్మవారి ఉత్సవమూర్తికి విశేష పూజలు చేశారు. ఆ తరువాత నిర్విఘ్న కార్యసిద్ధి సంకల్పంతో గణపతి పూజ, స్థల శుద్ధి కోసం పుణ్యాహ వాచనం, గంగాదేవికి శాస్త్రోక్తంగా సారె సమర్పణ చేశారు. అనంతరం అర్చకులు మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చారణల మధ్య స్వర్ణమ్మకు ద్వాదశ హారతులు పట్టారు. ఆగమ నియమాల ప్రకారం వివిధ రకాల హారతులను వరుసగా గంగమ్మకు సమర్పించారు.వేద ఘోష మధ్య దీపకాంతులను దర్శిస్తూ పలువురు భక్తులు నదిలో దీపాలు వెలిగించి వదిలారు.నదీ హారతుల సందర్భంగా ఈ ఏడాది ఏర్పాటు చేసిన లేజర్‌షో ఆకట్టుకుంది. స్వర్ణముఖి నది పడమర గట్టు నుంచి లేజర్ కిరణాలు హారతులు సమర్పించే ప్రాంతం, నదీజలాలు, రాజగోపురం, ముక్కంటి ఆలయ ఆలయ గోపురకలశాలు, భక్తకన్నప్ప కొండను తాకడాన్ని భక్తులు ఆసక్తిగా వీక్షించారు.ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, బొజ్జల బృందమ్మ, ముక్కంటి ఆలయ ఈవో బాపిరెడ్డి, టీడీపీ నాయకులు విజయకుమార్, చెంచయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.ఆసక్తికరమైన విషయం ఏంటంటే శ్రీకాళహస్తిలో శనివారం వేకువజాము నుంచి సాయంత్రం వరకు వర్షం విడవకుండా కురిసింది.నదీ హారతుల కోసం ముక్కంటి ఆలయం నుంచి గంగాదేవి ఉత్సవమూర్తి బయలుదేరిన వెంటనే వర్షం నిలిచిపోయింది.హారతుల ఘట్టం ముగిసిన తరువాత వర్షపు జల్లులు యధావిధిగా కొనసాగాయి.

జడివాన

● స్తంభించిన జనజీవనం

విజయపురం మండలం ఇళ్ళత్తూరులో మొరవ పారుతున్న చెరువు



చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుపాను ప్రభావంతో శనివారం రోజంతా మబ్బులు కమ్మేయడంతో పాటు చల్లటి గాలులు వీయడం,తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవడంతో జనజీవనం స్తంభించిపోయింది.రోజువారీ పనులపై ఆధారపడ్డ జనం వర్షంతో బయటకు రాలేకపోయారు.చిరువ్యాపారులు దుకాణాలు తెరచుకోలేక నష్టపోయారు. ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా 50శాతం మాత్రమే ఉద్యోగుల హాజరు నమోదయ్యింది.



విజయపురం మండలం ఇళ్లత్తూరులో వర్షంలోనూ ఆగని పెన్షన్ పంపిణీ

● నగరిలో 108.6 మిమీ వర్షపాతం

శనివారం పలు మండలాల్లో వానలు కురిశాయి. అత్యధికంగా నగరిలో 108.6మిమీ, అత్యల్పంగా రామకుప్పంలో ఒక మిమీ వర్షపాతం నమోదయ్యింది. నింద్రలో 77మిమీ, కార్వేటినగరంలో 62.4, విజయపురంలో 60.2, పాలసముద్రంలో 40.4, రొంపిచెర్లలో 36.8, శ్రీరంగరాజపురంలో 33.6, పులిచెర్లలో 32.2, ఐరాలలో 27.4, తవణంపల్లెలో 24.8, వెదురుకుప్పంలో 24.8, సదుంలో 24.4, పెనుమూరులో 24.4, బంగారుపాళ్యంలో 23.4, సోమలలో 23, పూతలపట్టులో 22.6, గుడిపాలలో 21.6, యాదమరిలో 21, చిత్తూరు రూరల్‌లో 18.4, గంగవరంలో 17.8, పలమనేరులో 17.2, గంగాధరనెల్లూరులో 17.2, చిత్తూరులో 17, బైరెడ్డిపల్లెలో 14.8, వి.కోటలో 12, చౌడేపల్లిలో 11.4, పెద్దపంజాణిలో 10.2, శాంతిపురంలో 9.6, పుంగనూరులో 9.6, కుప్పంలో 5.4, గుడుపల్లిలో 2.2 మిమీ వర్షపాతం నమోదయ్యింది.

యంత్రాంగం అప్రమత్తం


భారీ వర్షాలు కురిసే అవకాశమున్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించడంతో కలెక్టర్ సుమిత్‌కుమార్ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు.అవసరమైన లోతట్టు ప్రాంతాలవారికి సహాయ సహకారాలందించేందుకు సిద్ధంగా వుండాలని ఆదేశించారు. టెలికాన్ఫరెన్స్ నిర్వహించి మండలస్థాయిలో ఎంపీడీవోలు, తహసీల్దార్లు, అనుబంధ శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. సెలవులో వున్న అధికారులందరూ హెడ్‌క్వార్టర్లకు చేరుకోవాలని ఆదేశించారు. చెరువుకట్టలు, కాలువకట్టల పర్యవేక్షణపై దృష్టి పెట్టాలన్నారు. వాగులు, వంకలు, కాలువల వద్ద అప్రమత్తంగా ఉండాలని ఇరిగేషన్, రెవిన్యూ అధికారులను ఆదేశించారు.

సాయంకోసం కంట్రోల్ రూమ్స్

వర్ష బాధితులకు సహాయమందించేందుకు కలెక్టరేట్‌లోని పాత గ్రీవెన్స్‌హాలులో 24 గంటలూ పనిచేసేవిధంగా కంట్రోల్‌రూమ్‌ను ఏర్పాటు చేశారు.8గంటలకోసారి షిఫ్టు మారేవిధంగా రెవిన్యూ సిబ్బందికి కంట్రోల్‌రూమ్‌లో విధులు కేటాయిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. మండలకేంద్రాల్లో సైతం కంట్రోల్‌రూములను ఏర్పాటు చేశారు.అవసరమైనవారు కలెక్టరేట్ కంట్రోల్‌రూమ్ నెంబరు 94910 77356, ల్యాండ్‌లైన్ : 08572 - 242777, చిత్తూరు ఆర్డీవో కార్యాలయం : 94910 77011, కుప్పం ఆర్డీవో కార్యాలయం : 99660 72234, నగరి ఆర్డీవో కార్యాలయం : 96521 38325, పలమనేరు ఆర్డీవో కార్యాలయం : 94910 74510నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో...

చిత్తూరు రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వర్షాల కారణంగా విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తితే పరిష్కారం కోసం కంట్రోల్ రూములు ఏర్పాటు చేసినట్లు ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ తెలిపారు.చిత్తూరు రూరల్ డివిజన్ పరిధిలో 9491052934 ఫోన్ నెంబరును,అర్బన్ డివిజన్ పరిధిలో 9440817419 నెంబరును, పుంగనూరు పరిధిలో వినియోగదారులు 9154953764నెంబరును సంప్రదించాలన్నారు.



చిత్తూరు సీబీ రోడ్డులో విద్యుత్ మరమ్మతులు

హెచ్‌ఐవీ కేసులు తగ్గుముఖం



● నేడు ప్రపంచ ఎయిడ్స్ దినం

చిత్తూరు రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గతంతో పోలిస్తే హెచ్‌ఐవీ కేసులు తగుముఖం పట్టాయి.ఎయిడ్స్‌పై అవగాహన పెరగడంతో చికిత్స పొందేందుకు ధైర్యంగా ముందుకు వస్తున్నారు. ఒకప్పుడు హెచ్‌ఐవీ పాజిటివ్ రోగులకు సీడీ4 కౌంట్ 250కి చేరితేనే మందులు వాడేవారు. ప్రస్తుతం పాజిటివ్ వచ్చిన అందరికీ ఏఆర్‌టీ మందులు వాడిస్తూ జీవితకాలాన్ని పొడిగించే ప్రయత్నం చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 5952మంది రోగులుంటే వారిలో 3981మంది చిత్తూరులోని ఏఆర్‌టీ కేంద్రాల్లో మందులు తీసుకుంటున్నారు.

● 5952 మంది బాధితులు

జిల్లాలో గత 6సంవత్సరాల గణంకాల ప్రకారం 861850మందికి పరీక్షలు నిర్వహించగా 5952మందికి పాజిటివ్ వచ్చింది. 359152 గర్భిణులకు పరీక్షలు చేయగా 236మంది హెచ్‌ఐవీ బారిన పడినట్లు తేలింది.2006 నుంచి ఇప్పటివరకు 4623 మంది ఎయిడ్స్ రోగులు మృత్యువాత పడ్డారు.

● బస్సు పాసులు ఇవ్వాలి

ఏఆర్‌టీ కేంద్రాల ద్వారా అందించే మందుల కోసం దూర ప్రాంతం నుంచి హెచ్‌ఐవీ బాధితులు జిల్లా కేంద్రానికి వస్తుంటారు.నెలలో రెండుసార్లు మందులకోసం వస్తుండడంతో ఆర్థికంగా భారం అవుతోందని రోగులు వాపోతున్నారు.గత టీడీపీ ప్రభుత్వంలో హెచ్‌ఐవీ బాధితులకు ఆర్టీసీ బస్సుల్లో పాసులు ఇవ్వడం వల్ల ఖర్చు తగ్గేది. జగన్ అధికారంలోకి రాగానే ఉచిత పాసులను నిలిపివేశారు. తిరిగి కూటమి ప్రభుత్వం రావడంతో ఉచిత పాసులను పునవృద్ధరించాలని బాధితులు కోరుతున్నారు.

● పెరిగిన పింఛను

హెచ్‌ఐవీ బాధితులకు పౌష్టికాహారం తీసుకునేందుకు బాసటగా వుంటుందని గతంలో టీడీపీ ప్రభుత్వం రూ.2 వేల పింఛన్ ఇచ్చేది.గత వైసీపీ ప్రభుత్వం అనేక రకాల సాకులు చూపి పింఛన్లు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టింది. కూటమి ప్రభుత్వం రాగానే వారికి పింఛను రూ. 4 వేలకు పెంచింది.ప్రస్తుతం జిల్లాలో సుమారు 2116మందికి పింఛన్లందిస్తున్నారు. అనేక మంది పింఛన్లు తీసుకునేందుకు సిగ్గుపడి దరఖాస్తు చేసుకోవడం లేదని,వారిని గుర్తించి ఇటీవల పింఛన్ల కోసం దరఖాస్తులు చేయిస్తున్నట్లు జిల్లా హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నిర్మూలన అధికారి వెంకటప్రసాద్ తెలిపారు.

● ఆపరేషన్లు చేయకుండా రెఫర్

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఏ చిన్న ఆపరేషన్ చేయాలన్నా హెచ్‌ఐవీ పరీక్ష తప్పనిసరి. ఈ పరీక్షలో పాజిటివ్ వస్తే ఆపరేషన్లు చేయకుండా తిరుపతికి రెఫర్ చేసేస్తున్నారు. దీంతో హెచ్‌ఐవీ సోకిన గర్భిణులు బాగా ఇబ్బంది పడుతున్నారు.



ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన అవగాహన స్టాల్

నగరిలో ఈదురు గాలులు

నగరి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నగరి నియోజకవర్గంలో ఫెంగల్ తుపాను ప్రభావం బాగా కన్పించింది.నగరి మండలంలో శనివారం రాత్రి ఎనిమిది గంటల వరకు 108.6 మి.మీ వర్షపాతం నమోదైనట్లు తహశీల్దారు రవికుమార్ తెలిపారు.పెద్దఎత్తున గాలులు వీయడంతో చెట్లు, విద్యుత్‌స్తంభాలు నేలకొరిగాయి.నగరి ఓంశక్తి ఆలయం వద్ద శనివారం రాత్రి పెనుగాలులకు ఫ్లెక్సీ కింద పడడంతో ఆ మార్గంలో వస్తున్న విజయపురం మండలం పన్నూరుకు చెందిన అభి(30) అనే మహిళకు తలపై తీవ్రగాయాలయ్యాయి.చిత్తూరు-తచ్చూరు జాతీయ రహదారి నెంబరు 66 వద్ద పొలాల పక్కన రివిట్‌మెంట్ కట్టడంతో వర్షపు నీరు ఎటూ వెళ్లలేక పొలాల్లో నిలిచిపోవడంతో నాలుగు రోజుల క్రితం నాటిన చెరకు మొలకెత్తకుండా దెబ్బతినే ప్రమాదం ఏర్పడిందని రైతు మునస్వామిరెడ్డి వాపోయారు.గుండ్రాజుకుప్పంలో విద్యుత్ స్తంభం నేలకొరగడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.పుత్తూరు మండల పరిధిలోని భవానీ నగర్ వద్ద ఉప్పు కాలువ పొంగిపారుతుండడంతో తొరూరు, కొండల చెరువు, ఫైడిపల్లి తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.





చికిత్స పొందుతున్న అభి, ఫ్లెక్సీ పడడంతో చీలిన ఆమె తల



నందికి జలపాతాభిషేకం

పులకించిన నగరం

కొండకోనల్లో కురిసిన చినుకులు పాయలై పారి.. వాగులై ఉరికి.. జలపాతాలై దూకాయి. రాత్రి నుంచీ కురుస్తున్న వానలో తడిచి, తలకిబోసుకున్న ప్రకృతి కన్యలా తిరుమల కొండలు కళకళలాడుతున్నాయి. మాలాడగుండం, కపిలతీర్థం జలపాతాలు తిరుమల భక్తులకు స్వాగతం పలుకుతున్నాయి. కొండ సిగలో మెరుస్తున్న ఈ తెల్ల జలవంకలను చూస్తూ నగరవాసులు మురిసిపోతున్నారు. వాన పెంచిన చలికి జనం మరింత ముడుక్కుని గడుపుతున్నారు. చిన్నాచితకా వ్యాపారాలన్నీ గొడుగుల కిందకు చేరుకున్నాయి. శనివారం నాటి వాన దృశ్యాలను ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్లు అందిస్తున్నారు.



గోపురానికి నమస్కరిస్తున్న కపిలతీర్థం



గొడుగుల కింద తలదాచుకున్న కూరగాయల మార్కెట్

వాహనసేవలో కళా నీరాజనం


ముత్యపు పందిరి వాహనసేవలో వివిధ రాష్ట్రాలకు చెందిన 12 కళా బృందాలలోని 272 మంది కళాకారులు అమ్మవారికి కళా నీరాజనం సమర్పించారు. ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు చెందిన కళాకారులు కథక్, భరతనాట్యం, కూచిపూడి కళాకారులు ప్రదర్శనలు ఇచ్చారు. కంజీర కోలాటం, పిల్లనగ్రోవి వంటి జానపద నృత్యాలను ప్రదర్శించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న జల్లుల మధ్య తిరుపతి ఎస్వీ సంగీత, నృత్య కళాశాలలకు చెందిన విద్యార్థులు పౌరాణిక పాత్రలను పోషించి భక్తులను అలరించారు.



ముత్యపు పందిరిపై పద్మావతమ్మ

రాలిన చినుకు.. నత్త గర్భంలో ముత్యంగా మారుతుంది. కురుస్తున్న చినుకుల్లో ఆ ముత్యాల వాహనంలోనే పద్మావతీ దేవి తిరుచానూరు మాడవీధుల్లో ఊరేగారు. కార్తీక బ్రహ్మోత్సవాల్లో శనివారం ఉదయం ముత్యపు పందిరిపై అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. వర్షంతో పటాటోపం కిందనే ఊరేగింపు సాగింది. మేళతాళాలు, భజన, కళాబృందాలు తడుస్తూనే ప్రదర్శనలు ఇచ్చారు. పండితులు గొడుగుల కిందకు చేరి వేదపారాయణం సాగించారు. కార్యక్రమాల్లో జీయర్ స్వాములు, టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, ఎస్పీ సుబ్బరాయుడు, జేఈవో వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో సతీష్‌కుమార్, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

- తిరుచానూరు,ఆంధ్రజ్యోతి





శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల, నవంబరు30(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌-2లో 27 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు.. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌-1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించింది. రూ.3.77 కోట్లు ఆదాయం లభించినట్టు శనివారం ఉదయం ప్రకటించింది. శుక్రవారం 62,147 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 23,096 మంది తలనీలాలు సమర్పించారు.

స్విమ్స్‌కు రూ.10 లక్షల విరాళం

తిరుపతి(వైద్యం), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్విమ్స్‌లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు హైదారాబాదుకు చెందిన ఇడిముక్కల హాసిని రూ.10 లక్షల విరాళం అందజేశారు. స్విమ్స్‌లో శనివారం డైరెక్టర్ ఆర్వీకుమార్‌ను కలిసి డీడీని అందించారు. హాసిని మాట్లాడుతూ తన తాత ఇడిముక్కల యతిరాజయ్య జ్ఞాపకార్థం ఈ నగదును అందిస్తున్నట్లు తెలిపారు. హాసిని కుటుంబ సభ్యులు శ్రీనివాసరావు, స్రవంతి, రాజేష్ బాబు పాల్గొన్నారు.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

తిరుపతి(సెంట్రల్), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని పలు ఎక్స్‌ప్రెస్‌లకు అదనపు కోచ్‌లు ఏర్పాటు చేస్తున్నామని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భువనేశ్వర్-తిరుపతి మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్‌లకు రెండు థర్డ్ ఏసీ కోచ్‌లను ఏర్పాటు చేశామని వెల్లడించారు. అలాగే బెంగళూరు-భువనేశ్వర్, పూరీ-యశ్వంతపూర్ మధ్య నడుస్తున్న ఎక్స్‌ప్రెస్‌లకు రెండు థర్డ్ ఏసీ కోచ్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు.

యువకుడి దారుణహత్య

ఉసురు తీసిన వివాహేతర సంబంధం



శ్రీకాళహస్తి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం కారణంగా యువకుడు హత్యకు గురయ్యాడు. శ్రీకాళహస్తి మండలం చుక్కల నిడిగల్లు పంచాయతీ ఓటుగుంట సెంటర్‌కు చెందిన రవి(20) భవన నిర్మాణ కార్మికుడు. ఇదే సెంటర్‌కు చెందిన ఆర్ముగం అతనికి సమీప బంధువు. కొంతకాలంగా ఆర్ముగం కుటుంబసభ్యురాలితో రవి వివాహేతర సంబంధం కొనసాగించేవాడు. దీనిపై ఆగ్రహించిన ఆర్ముగం శనివారం రాత్రి రవి ఇంటి వద్దకు కత్తితో వెళ్లాడు. మాటా మాటా పెరగడంతో రవిపై కత్తితో దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీకాళహస్తి రూరల్ సీఐ రవి నాయక్, ఏఎస్ఐ మధు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఆర్ముగంను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

అలిపిరిలో తనిఖీల వైఫల్యం

- అన్యమత వ్యాఖ్యలతో తిరుమలకు వచ్చిన కారు



తిరుమల, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): అలిపిరిలో భద్రతా తనిఖీల వైఫల్యం మరోసారి వెలుగుచూసింది. అన్యమతనానికి చెందిన వ్యాఖలతో కూడిన ఓ కారు తిరుమలకు రావడం విమర్శలకు దారితీసింది. సాధారణంగా రాజకీయ, ఇతర మతాలకు చెందిన ఫొటోలు, గుర్తులు, నినాదాలతో వాహనాలు తిరుమలకు రావడం నిషేధం. వీటిని అలిపిరి చెక్‌పాయింట్ తనిఖీల్లోనే భద్రతా సిబ్బంది అడ్డుకోవాలి. అయితే సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఇతర మతానికి చెందిన వ్యాఖ్యలతో కూడిన కారు నేరుగా తిరుమలకు చేరుకుంది. ఆ కారును ఆలయానికి సమీపంలోని అర్చక నిలయం వద్ద పార్కింగ్‌లో ఉంచడం చర్చనీయాంశమైంది.

3న స్థానికులకు శ్రీవారి దర్శనం

- రేపు తిరుపతి, తిరుమలలో టోకెన్ల జారీ

తిరుమల, నవంబరు30(ఆంధ్రజ్యోతి): తిరుమల, తిరుపతి అర్బన్, రూరల్, చంద్రగిరి, రేణిగుంట మండలాలకు చెందిన భక్తులకు టీటీడీ శుభవార్త తెలిపింది. డిసెంబరు 3న శ్రీవారి దర్శనాన్ని కల్పించనున్నట్టు టీటీడీ ప్రకటించింది. గతంలో ప్రతి నెలా మొదటి మంగళవారం స్థానికులకున్న దర్శనాన్ని టీటీడీ రద్దు చేసిన విషయం తెలిసిందే. దీనిని పునరుద్ధరించాలని నవంబరు 18న టీటీడీ బోర్డు నిర్ణయించింది. గతంలో తిరుమల, తిరుపతి అర్బన్, రూరల్‌కే పరిమితం చేయగా.. ఈసారి రేణిగుంట, చంద్రగిరి మండలాలనూ కలిపారు. డిసెంబరు 3న స్థానికులకు దర్శనం కోసం.. 2వ తేదీ ఉదయం 5 గంటలకు తిరుపతి మహతి ఆడిటోరియం, తిరుమలలోని బాలాజీనగర్‌లో కమ్యూనిటీ హాల్‌లో టోకెన్లను జారీ చేయనున్నారు. ఒరిజనల్ ఆధార్‌కార్డు చూపించి టోకెన్లు పొందాలి. ఆదివారం టోకెన్లు జారీ చేయాలని నిర్ణయించినప్పటికీ వర్షాల నేపథ్యంలో సోమవారానికి మార్చారు.



రేణిగుంట మండలం గాజులమండ్యం- కల్లూరు గ్రామాల మధ్య వాగు ఉధృతితో మూసేసిన రోడ్డు

ఒకటే వాన

జిల్లాలో శుక్రవారం రాత్రి నుంచి వానలు విస్తారంగా పడుతున్నాయి. దీంతో వాగులు, వంకల్లో నీటి ప్రవాహం మొదలైంది. పలుచోట్ల రోడ్లపై నీళ్లు చేరాయి. వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. పలు చోట్ల పొలాల్లోకి నీళ్లు చేరాయి. జనజీవనానికి ఇబ్బందగా మారింది. చిరు వ్యాపారులు అవస్థలు పడ్డారు.

- ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్ వర్క్



దొరవారిసత్రం మండలం కుప్పారెడ్డిపాళెం వద్ద వెదురుపట్టు రోడ్డులోని వంతెనపై ప్రవహిస్తున్న పాల కాలువ.. పాలకాలువ వరదను పరిశీలిస్తున్న తహసీల్దారు శైలాకుమారి, ఎంపీడీవో గోవర్ధన్ తదితరులు



నాయుడుపేట లోతువానిగుంట బీసీ బాలుర వసతిగృహం వద్దకు చేరుకున్న వర్షపునీరు



కోట మండలం విద్యానగర్ స్టేట్‌బ్యాంకు వద్ద..



తిరుపతిలో



పుత్తూరు పట్టణ సమీపంలో భవానీనగర్ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న ఉప్పుకాలువ



బీఎన్‌కండ్రిగ మండలం కనమనంబేడులోని చెరువు కట్టపై కూలిన వృక్షం



నారాయణవనం మండలం తిరువట్యం కాజ్‌వేను పరిశీలిస్తున్న ఎస్ఐ రాజశేఖర్



పునరావాస కేంద్రంలో ఉన్న ఓజిలి మండలం నెమళ్ళపూడి గిరిజనులు



తిరుపతిలో..



ఏర్పేడు మండలం మోదుగులపాళెం వద్ద స్వర్ణముఖి నది లోలెవల్ కాజ్‌వేపై ప్రవహిస్తున్న వర్షపునీరు

వైభవంగా పార్థివలింగాలకు రుద్రాభిషేకం



కోనేరులో ఏర్పాటు చేసిన పార్థివలింగం, పార్థివలింగాలకు రుద్రాభిషేకాలు చేస్తున్న భక్తులు

పుంగనూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం బహుళపంచమి అమావాస్య సందర్భంగా శనివారం పుంగనూరు మినీ బైపాస్‌రోడ్డులోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ కోనేరులో అర్చకులు పార్థివలింగ రుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు రామచంద్ర, రాము, సుబ్బయ్య స్వాములు కోనేరులో ప్రత్యేకంగా 11 పుట్టల నుంచి తెచ్చిన మట్టి, సుగంధ ద్రవ్యాల మిశ్రమంతో ప్రత్యేకంగా పార్థివలింగాన్ని ఏర్పాటు చేసి అలంకరణలు చేసి శాస్త్రోక్తంగా పూజలు చేశారు. తొలుత కోనేరు వద్ద వెలసిన అన్నపూర్ణేశ్వరీదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామిలకు ప్రత్యేక పూజలు చేసి మధ్యాహ్నం భక్తులకు పార్థివ లింగాలను అందజేయగా వారు కోనేరులో పూజకు సిద్ధం చేసుకున్నారు. అర్చకులు వేద మంత్ర పారాయణంతో భక్తి శ్రద్ధలతో పార్థివలింగాలకు ప్రాణప్రతిష్ఠ చేసి రుద్ర, నమక, చమక, పురుష, శ్రీసూక్తం చెబుతూ రుద్రాభిషేకం చేయగా భక్తులు వారి వద్ద ఉన్న లింగాలకు స్వహస్తాలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ ద్వాపర యుగంలో రత్నలింగం, త్రేతాయుగంలో సువర్ణ లింగం, కలియుగంలో పార్థివలింగ పూజ శీఘ్రఫలితాన్ని ఇస్తాయని వివరించారు. పార్థివలింగ పూజ నిర్వహించిన వారికి శుభాలు కలుగుతాయని వివరించారు.


వైసీపీ నాయకుడి చెర నుంచి మా భూమిని విడిపించండి



చంద్రబాబుకు సమస్యను వివరిస్తున్న వెంకటేశు, బాలకృష్ణ కుటుంబ సభ్యులు

గుడుపల్లె, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు నుంచి తమ భూమిని తమకు ఇప్పించాలని పెద్దభజనవాడ పంచాయతీ కమ్మగుట్టపల్లెకు చెందిన వెంకటేశు, బాలకృష్ణ సీఎం చంద్రబాబును కోరారు. శనివారం ఉండవల్లిలో సీఎంను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందించారు. వెంకటేశు మాట్లాడుతూ 2020లో అనారోగ్యం బారినపడడంతో తమ గ్రామానికే చెందిన పూజారి మునెప్ప వద్ద రూ.2లక్షలు అప్పుచేశానని తెలియజేశాడు. అందుకు భూమికి సంబంధించిన పత్రాలను మునెప్ప వద్ద ఉంచామన్నాడు. కొన్ని రోజుల తరువాత తమ భూమి 1.80 ఎకరాలను మునెప్ప తన పేరు మీద అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకొన్నాడని వాపోయాడు. అప్పుగా తీసుకొన్న డబ్బులు ఇస్తామని వేడుకుంటున్నా ఒప్పుకోవడం లేదని పైగా తమపై దాడులు చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశాడు. న్యాయం జరిగేలా చూస్తానని సీఎం హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

ఎన్టీఆర్ జలాశయం నుంచి నీరు విడుదల



పెనుమూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): పెనుమూరు మండలం కలవగుంటలో ఉన్న ఎన్టీఆర్ జలాశయం నుంచి రెండు గేట్ల ద్వారా దిగువకు 200 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు.తుపాను కారణంగా జలాశయానికి ఎగువ ప్రాంతాలైన పూతలపట్టు, ఐరాల మండలాల్లో వర్షాలు కురిసి జలాశయానికి నీళ్లు చేరినట్లు ఇరిగేషన్ ఏఈ భరత్ తెలిపారు.

జడివానలోనూ 93 శాతం పింఛన్లు అందజేత

చిత్తూరు సెంట్రల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): జడివానలోనూ శనివారం జిల్లా వ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ జరిగింది. డిసెంబరు ఒకటి ఆదివారం కావడంతో ఒక్కరోజు ముందే శనివారం పింఛన్ల పంపిణీ చేపట్టారు. డీఆర్‌డీఏ, గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది సంయుక్తంగా తొలి రోజున ఉదయం ఆరు నుంచి సాయంత్రం 6.45 గంటల వరకు జిల్లా వ్యాప్తంగా 93.58 శాతం పింఛన్లు పంపిణీ చేశారు. వర్షం పడుతున్నా.. లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛను సొమ్ము అందజేశారు. జిల్లావ్యాప్తంగా 2,66,703 మంది పింఛన్‌దారులు ఉండగా, తొలి రోజున 2,49,583 మందికి పంపిణీ చేశారు. మిగిలిన 17,120 మందికి సోమవారం అందజేయనున్నారు.

జడ్పీలో 20 మందికి రికార్డు అసిస్టెంట్లుగా పదోన్నతి

చిత్తూరు రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ పరిధిలో పని చేస్తున్న 20 మంది ఆఫీస్ సబార్డినేట్లకు రికార్డు అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించారు. ఈ మేరకు జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

రేపు సదుంలో కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు


చిత్తూరు క్రీడలు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): సదుంలోని పోలీస్ గ్రౌండ్‌లో ఈనెల 2వ తేదీనఉమ్మడి చిత్తూరు సీనియర్ మహిళా, పురుషుల జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి మమత తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 5 నుంచి 8వ తేదీవరకు ప్రకాశం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. పురుషులు 85 కిలోల్లోపు, మహిళలు 75 కిలోల్లోపు ఉన్నవారు అర్హులన్నారు. క్రీడాకారులు ఏడు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డు జెరాక్స్ వెంట తేవాలన్నారు.

తల్లిని చంపిన కానిస్టేబుల్ అరెస్టు

చిత్తూరు అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగడానికి డబ్బివ్వలేదనే కోపంతో తల్లిపై దాడి చేసి.. ఆమె మరణానికి కారణమైన కానిస్టేబుల్ శంకర్‌ను శనివారం రెండో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. చిత్తూరులోని రోసీనగర్‌కు చెందిన వసంతమ్మ తన కొడుకును కానిస్టేబుల్‌ను చేసింది. అతడు జీడీ నెల్లూరు, నింద్ర మండలాల్లో విధులు నిర్వహిస్తూ పలు ఆరోపణలు రావడంతో సస్పెండ్ అయ్యాడు. ఇంట్లోనే ఉన్న అతడు మద్యానికి డబ్బు కావాలని తల్లిని అడగ్గా ఆమె నిరాకరించారు. ఆగ్రహించిన అతను తల్లిని కాలితో తన్నడంతో ఆమె కిందపడటంతో తలకు బలమైన గాయమైంది. తర్వాత చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిని శనివారం అతడి ఇంటి వద్దనే అరెస్టు చేసి.. రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

ఆలయంలో చోరీ చేసిన దొంగ అరెస్టు

- ఆభరణాల స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆభరణాలు

పూతలపట్టు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): శ్రీలక్ష్మీనరసింహా స్వామి ఆలయంలోని నగలను స్వాహా చేసిన దొంగను పోలీసులు అరెస్టు చేశారు. పూతలపట్టు మండలం కమ్మగుట్టపల్లె గ్రామ సమీపాన ఉన్న ఆలయంలో ఈ ఏడాది జూన్ ఏడో తేదీన స్వామివారికి అలంకరించిన బంగారు, వెండి ఆభరణాలను గుర్తుతెలియని వ్యక్తులు చోరీచేశారు. ఆలయ ధర్మకర్త ఫిర్యాదుతో సీఐ కృష్ణమోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈనెల 29వ తేదీన ఎం.బండపల్లి బస్టాపు వద్ద పుత్తూరు టౌన్ కామరాజు నగర్ గేటుకు చెందిన వాహిద్ కుమారుడు షేక్ మస్తాన్ ఉండగా అనుమానంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారించగా.. లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో చోరీకి పాల్పడడమే కాకుండా ఈ ఏడాది ఏప్రిల్ 16వ తేదీన తన స్నేహితులతో కలిసి పూతలపట్టు సమీపాన ద్విచక్రవాహనంలో వెళుతున్న ఓ వ్యక్తి బంగారు చైన్ లాక్కెళ్లిందీ తానేనని అంగీకరించాడు. దీంతో ఆభరణాలను స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

నెలకు చెత్త తరలింపు ట్రాక్టర్ అద్దె రూ.90 వేలా..?

- ప్రజాధనం దుర్వినియోగం సరికాదు
- పుంగనూరు మున్సిపల్ మీట్‌లో కౌన్సిలర్ల ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ అలీంబాషా, కౌన్సిలర్ రామకృష్ణమరాజు

పుంగనూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మున్సిపల్ పరిధిలో చెత్తను తరలించేందుకు నెలకు రూ.90 వేల అద్దెతో ట్రాక్టర్ ఏర్పాటు కంటే మూడు నెలల అద్దె ఖర్చుతో సొంత ట్రాక్టర్ పెట్టుకోవచ్చునని కౌన్సిలర్ ఎం.రామకృష్ణమరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు ఇష్టారాజ్యంగా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం తగదన్నారు. శనివారం మున్సిపల్ కౌన్సిల్ హాల్లో చైర్మన్ ఎస్.అలీంబాషా అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్ రామకృష్ణమరాజు మాట్లాడుతూ పట్టణంలోని వాటర్ ట్యాంకుల్లో నీటిని శుభ్రం చేయడానికి లిక్విడ్‌ను కలుపుతున్నట్లు తప్పుడు లెక్కలు చూపిస్తున్నారని, అయితే ఎక్కడా వాటర్‌ట్యాంకుల్లో లిక్విడ్ కలప లేదని ఆరోపించారు. చెత్త తరలించడానికి ట్రాక్టర్ ఏర్పాటు చేసి నెలకు రూ. 90వేలు ఖర్చు చేయాలనడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఆ అద్దెకు బదులు కొత్త ట్రాక్టర్ కొనుగోలు చేసుకోవచ్చునని సూచించారు. తాగునీటి ట్యాంకర్ల మరమ్మతుల పేరుతో వేలకు వేలు ఖర్చు చేసినట్లు కౌన్సిల్ ఆమోదానికి పెట్టడం ఏమిటని నిలదీశారు. పాత ట్యాంకర్ల మరమ్మతులకు ఖర్చు చేసే డబ్బులు కొత్త ట్యాంకర్లను రూ. 60 నుంచి రూ.75వేలుతో కొనుగోలు చేయడానికి అవకాశాలు ఉన్నట్లు వివరించారు. తాగునీటి బోరుమోటర్లు మరమ్మతుల పేరుతో వేల రూపాయలు బిల్లు పెట్టుతున్నారని, ఆ బిల్లులతో కొత్త మోటర్లు కొనుగోలు చేయవచ్చునన్నారు. అలాగే గత ప్రభుత్వ పాలనలో జిరాక్స్ మిషన్లు, ప్రింటర్లు, కంప్యూటర్లు కొనుగోలు చేసినా రెండు మూడు నెలలకే పాడై మూలన పడినట్లు ఆరోపించారు. నాసిరకం కంపెనీలతో కలిసి కొనుగోలు చేయడం వల్ల ప్రజాధనం దుర్వినియోగం చేసినట్లు గుర్తుచేశారు. దీనిపై మున్సిపల్ డీఈఈ మహేశ్ మాట్లాడుతూ షిరిడి సాయిబాబా ఆలయం, సుబేదారు వీధిలో ఉన్న బోరుమోటర్లను బయటకు తీయడానికే అధికంగా నిధులు ఖర్చు చేసి బిల్లులు పెట్టాల్సివచ్చిందన్నారు. కౌన్సిలర్ మనోహర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసిన నిధులను ప్రజాప్రతినిధుల అనుమతులు లేకుండా అధికారులు ఇష్టారాజ్యంగా పనులు చేయడం ఏమిటని నిలదీశారు. నక్కబండ ప్రాంతంలో ఇళ్లకు పన్నులు విధించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదని, కాలనీలో మౌలిక వసతులు కల్పించడం లేదని, కనీసం ప్రజలకు తాగునీరు ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నామని విచారం వ్యక్తం చేశారు. కమిషనర్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు వార్డుపరిధిలో సమస్యలను తన దృష్టికి తీసుకురాలేదన్నారు. కౌన్సిలర్ పూల త్యాగరాజు మాట్లాడుతూ పట్టణంలోని హిందు శ్మశానంలోకి ఆర్టీసీ బస్టాండ్ నుంచి వర్షపు నీరు వెళ్లడం వల్ల అంత్యక్రియలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అధికారులు సర్వే చేసి వర్షపునీరు శ్మశానంలో నిలవకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణ పరిధిలో వీధికుక్కలు బెడద తొలగించాలని కోరారు.అనంతరం అజెండా అంశాలను కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఆమోదించారు.వైస్ చైర్‌పర్సన్ లలిత, మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పోలీసుల రీసెటిల్‌మెంట్, రీఎంప్లాయిమెంట్‌కు తోడ్పాటు అందించండి

గంగాధరనెల్లూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పోలీసులకు సంబంధించి రీసెటిల్‌మెంట్‌తోపాటు రీఎంప్లాయిమెంట్‌కు తోడ్పాటు అందించాలని ఏపీ రిటైర్డ్ పోలీసుల యూనియన్ సంక్షేమసంఘం అధ్యక్షుడు, రిటైర్డ్ ఎస్పీ పి.చిన్నస్వామి కోరారు. హైదరాబాద్‌లో శనివారం ఇన్స్‌పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ చారుసిన్హా, అదేవిధంగా డీఐజీలు ప్రవీణ్, ఎస్.ఎన్.మిశ్రాలకు ఆంధ్ర తరఫున చిన్నస్వామి, తెలంగాణ తరఫున రాష్ట్ర రిటైర్డ్ పోలీసుల యూనియన్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా చిన్నస్వామి మాట్లాడుతూ.. పోలీసులకు క్యాంటీన్లను విరివిగా ఏర్పాటుచేసి చేయూత అందించాలని కోరామన్నారు. అలాగే రిటైర్డ్ పోలీసులకు ప్రత్యేకించి కార్పొరేషన్, వెల్ఫేర్‌బోర్డులను ఏర్పాటు చేయించాలని విన్నవించామన్నారు. తమ వినతులపై సానుకూలంగా స్పందించారని చెప్పారు. ఏపీ రాష్ట్ర రిటైర్డ్ పోలీసుల యూనియన్ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు బాలసుబ్రమణ్యం, రాజేష్, ఏడుకొండలు, ప్రధానకార్యదర్శి హరినాథ్, జాయింట్ కార్యదర్శులు అప్పారావు, సుబ్రహ్మణ్యం, ట్రెజరర్ శ్రీనివాసులు, తెలంగాణ రాష్ట్ర పోలీసుల సంక్షేమ సంఘం అడ్వైజర్ ఎస్.ఎన్.రెడ్డి పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యంలో గురజాడది ప్రత్యేక స్థానం



సమావేశంలో మాట్లాడుతున్న ఇంచార్జి వీసీ దొరస్వామి

గుడుపల్లె, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్యంలో గురజాడ అప్పారావు స్థానం ప్రత్యేకమైనదని ద్రావిడ విశ్వవిద్యాలయ ఇంచార్జి వీసీ దొరస్వామి పేర్కొన్నారు. శనివారం ద్రావిడ వర్సిటీ ఎమినో భవనంలో గురజాడ సాహిత్యం-సమాలోచన అనే అంశంపై సింపోజియం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వీసీ మాట్లాడుతూ.. గురజాడ అప్పారావు రచనలకు వందేళ్లు దాటుతున్నా ఈనాటికి ప్రజల మన్ననలను పొందుతున్నాయన్నారు. వాడుక భాషలో రచనలు చేసి ఆయన ప్రజల మెప్పు పొందారన్నారు. ఆయన రచించిన కన్యాశుల్కం నాటకానికి సాహిత్య లోకంలో ప్రత్యేకమైన స్థానం ఉందని చెప్పారు. ఇంచార్జి రిజిస్ట్రార్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. తెలుగు సాహిత్యంలో వాడుక భాష పెంపునకు కృషిచేసిన వారిలో గురజాడ ముఖ్యుడన్నారు. గురజాడ జీవితం, రచనల గురించి అకడమిక్ డీన్ శ్యామల వివరించారు.

రాజనాలబండలో సత్య ప్రమాణం అనగానే

చోరీకి గురైన బంగారు నగలు ప్రత్యక్షం



రాజనాలబండలో వెలసిన ఆంజనేయస్వామి, సత్య ప్రమాణానికి వచ్చిన శెట్టిపల్లె గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆలయ నిర్వాహకులు

చౌడేపల్లె, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): రాజనాలబండలో సత్యప్రమాణం అనగానే చోరీకి గురైన బంగారు నగలు ప్రత్యక్షం అయ్యాయి. బాధితురాలి కథనం మేరకు.. సోమల మండలం నెల్లిమంద శెట్టిపల్లెకు చెందిన లక్ష్మీదేవి, రామసముద్రం మండలంలో ఉండే రామకృష్ణ అన్నాచెల్లెలు. రామకృష్ణకు గత నెల 19న రోడ్డు ప్రమాదం జరిగింది. దీంతో చెల్లెలు వెంటనే అన్న కోసం మదనపల్లె ఆస్పత్రికి వెళ్లింది. ఇదే అదునుగా గుర్తుతెలియని వ్యక్తులు ఆమె ఇంట్లో ఉంచిన నక్లెస్, 2 జతల చెవిచుట్లు, 2 మైనూర్ చైన్లు, ఒక జత జుంకీలు, 2 ఉంగరాలు మొత్తం సుమారు 100 గ్రాముల బంగారు నగలు చోరీ చేశారు. ఆమె తన అన్నను చూసి తిరిగి వచ్చేసరికి ఇంట్లో వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. చోరీ జరిగినట్లు గుర్తించింది. గ్రామపెద్దల సూచనతో రాజనాలబండలో సత్యప్రమాణం చేయడానికి ఆలయ నిర్వాహకులు వద్ద అనుమతి తీసుకుంది. గ్రామస్తులకు చెప్పి సత్య ప్రమాణానికి రావాలని కోరింది. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం 2 ఉంగరాలు తప్ప మిగిలిన బంగారు నగలు ఉన్న మూట ఆమె ఇంటి ముందు పడేసి వెళ్లారు. ఉంగరాల విషయం కూడా తేలాలని గ్రామస్తులు శనివారం రాజనాలబండకు వచ్చారు. ఆలయ నిర్వాహకులు గ్రామస్తులతో విడివిడిగా మాట్లాడి సత్యప్రమాణం వచ్చే వారానికి వాయిదా వేశారు.

త్రోబాల్ పోటీల్లో చిత్తూరు జట్ల సత్తా



ప్రథమ బహుమతి గెలుచుకున్న చిత్తూరు బాలికలు, బాలుర జట్లు

పూతలపట్టు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు ఉన్నత పాఠశాల ఆవరణంలో శనివారం అండర్-14 రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలు ముగిశాయి. ప్రతివిద్యార్థీ చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని తహసీల్దార్ గురప్ప అన్నారు. అనంతరం విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. రాష్ట్ర పరిశీలకుడు చక్రపాణి, నిర్వాహకులు కృష్ణ, డిల్లీరాణి, ఇంటర్ జోనల్ కన్వీనర్ మోహన్ రెడ్డి, స్కూల్ కమిటీ చైర్మన్ నేతాజీ, పలు జిల్లాలకు చెందిన పీడీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

విజేతలిలా..

బాలికల విభాగంలో.. చిత్తూరు జట్టు ప్రథమ బహుమతి గెలుపొందగా, కర్నూలు, అనంతపురం, కడప జిల్లాలు రెండు, మూడు, నాలుగు స్థానాలను దక్కించుకున్నాయి. బాలుర విభాగంలో.. చిత్తూరు జట్టు మొదటి బహుమతి సాధించగా, కడప, అనంతపురం, కర్నూలు జట్లు రెండు, మూడు, నాలుగు స్థానాలను కైవసం చేసుకున్నాయి.

ప్రజలతో సామరస్యంగా మెలగాలి: ఎస్పీ



చిత్తూరు అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రజలతో సామరస్యంగా మెలగాలని ఎస్పీ మణికంఠ అన్నారు. శనివారం జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో జూమ్‌కాన్ఫరెన్స్ ద్వారా నెలవారీ సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న గ్రేవ్, నాన్‌గ్రేవ్ కేసులు, మర్డర్, డెకాయిట్, మిస్సింగ్, చీటింగ్, సైబర్ తదితర నేరాలపై పోలీసు స్టేషన్ల వారీగా సమీక్షించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని పాటిస్తూ.. స్టేషన్లకు వచ్చే వారితో స్నేహపూర్వకంగా నడుచుకోవాలన్నారు. మహిళలు, చిన్నారుల ఫిర్యాదులపై వెంటనే స్పందించాలన్నారు.

పోలీసులకు ముగిసిన యోగాసనాల శిక్షణ

పోలీసు శిక్షణ కేంద్రంలో వారం రోజులుగా సిబ్బందికి నిర్వహించిన యోగాసనాలు, ప్రాణయామం శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. జిల్లాలోని ప్రతి పోలీసుస్టేషన్ నుంచి ఒక్కొక్కరు చొప్పున మొత్తం 38మందిని ఎంపిక చేశారు. చిత్తూరుకు చెందిన శివానంద పిరమిడ్ ధ్యానకేంద్రం వారి సహకారంతో ఈ శిక్షణ నిర్వహించారు. ఏఆర్ ఏఎస్పీ శివానంద కిశోర్, రెండో పట్టణ సీఐ నెట్టికంఠయ్య ప్రసంగించగా, పోలీసు ట్రైనింగ్ సెంటర్ సీఐ అమరనాథరెడ్డి, ధ్యాన పిరమిడ్ సభ్యులు, యోగా మాస్టర్లు నాగరాజు, యువరాజు, డిల్లీబాబు, రేవతి పాల్గొన్నారు.

11 విమానాల రద్దు.. ఒకటి దారి మళ్లింపు

రేణిగుంట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జడివానతో రేణిగుంటలోని విమానాశ్రయంలో ల్యాండింగ్‌కు వాతావరణం అనుకూలించకపోవడంతో 12 విమాన సర్వీసులు రద్దయ్యాయి. శనివారం 16 సర్వీసులు నడవాల్సి వుండగా ఉదయం నాలుగు మాత్రం వచ్చి వెళ్ళాయి. ఆ తర్వాత హైదరాబాదు నుంచీ వచ్చిన ఇండిగో విమానం రేణిగుంటలో ల్యాండ్ కాలేకపోవడంతో 15 నిమిషాలపాటు చక్కర్లు కొట్టాక.. దాన్ని బెంగళూరుకు మళ్లించారు. దీంతో ఇండిగో, స్పైస్ జెట్, ఎయిర్ అలయెన్స్, స్టార్ ఎయిర్ లైన్స్ సంస్థలకు చెందిన 11 సర్వీసులను రద్దు చేశారు.

62 బస్సుల నిలిపివేత

తిరుపతి (రవాణా), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పలుచోట్ల కాజ్‌వేలపై నీటి ఉధ్రుతి, వాగులు, వంకలు పొంగుతుండటంతో 62 ఆర్టీసీ బస్సు సర్వీసులను నిలిపివేశారు. తిరుపతి, తిరుమల, మంగళం, అలిపిరి, శ్రీకాళహస్తి, పుత్తూరు, సత్యవేడు, వాకాడు, గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి డిపోల నుంచి పలు నగరాలకు, గ్రామాలకు బస్సులను రద్దు చేశారు. ప్రధానంగా తిరుపతి-చెన్నై నాలుగు ఇంద్ర బస్సులు, తిరుమల-పాపవినాశనం మధ్య 8, తిరుత్తణి-తిరుమల మధ్య మూడు, శ్రీకాళహస్తి-చెన్నై, తిరుపతి మధ్య 4, మిగిలిన మార్గాల్లో ఒక్కోటి చొప్పున రద్దు చేశారు. దాదాపు 150ట్రిప్పులు ఆగాయి. వరదయ్యపాలెం మండలం గోవర్ధనపురం సమీపంలో మారేడు కాలువ పొంగి ప్రవహిస్తోంది. నీటి ప్రవాహం తక్కువగా ఉందని భావించిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ బస్సును ముందుకు తీసుకెళ్లగా.. కాజ్‌వేపై నీటి ఉధృతిలో ఆగిపోయింది. బస్సులోని 40 మంది ప్రయాణికులు భయాందోళన చెందారు. గ్రామస్తులు చేరుకుని వీరిని క్షేమంగా గట్టుకు చేర్చారు.

ఆలస్యంగా రైళ్ల రాకపోకలు

తిరుపతి(సెంట్రల్), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): చెన్నై నుంచి బయలు దేరవలసిన పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను తిరువళ్ళూరు నుంచి నడిపినట్లు అధికారులు తెలిపారు. తిరుపతి- చెన్నై మధ్య నడుస్తున్న సప్తగిరి, గరుడాద్రి ఎక్స్‌ప్రెస్‌లు శనివారం తిరువళ్ళూరు నుంచి తిరుపతికి రాకపోకలు సాగించాయి.



బాబంటే అంతే!

కుప్పం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు అంటే కుప్పం ప్రజలకు అంతే.. అంతులేని ప్రేమ. రాష్ట్రంలో ఎవరికైనా ఆయన సీఎం కానీ, సొంత నియోజకవర్గ ప్రజలకు తమ కుటుంబ సభ్యుడు. వీరికి అభివృద్ధిని, సంక్షేమాన్ని ప్రసాదించిన దేవుడు ఆయన. అందుకే గుడుపల్లె మండలం కమ్మగుట్టపల్లె, జాతికర్తనపల్లెలనుంచి అయ్యప్పస్వామి దర్శనానికి బయలుదేరి వెళ్లిన మాల ధారణ చేసిన భక్తబృందం, రాజాధాని అమరావతిలోని ఉండవల్లిలో శనివారం సీఎం చంద్రబాబును కలిశారు. కనకదుర్గమ్మ దర్శనంతోపాటు తమ నాయకుడి దర్శనమూ చేసుకున్నారు. ఆయన కూడా వారిని ఆహ్వానించి, యోగక్షేమాలు విచారించారు. గ్రూప్ ఫోటో దిగి సాదరంగా వీడ్కోలు పలికారు.

రోడ్లు బాగు చేయండి



పలమనేరు, నవంబరు30 (ఆంధ్రజ్యోతి) : గంగవరం పంచాయితీ పరిధిలో మూడు కిలో మీటర్ల మేర రోడ్లు గుంతలమయంగా మారి ఇబ్బందికరంగా ఉందని వాటిని బాగు చేయాలని గ్రామస్తులు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. గంగవరం పంచాయితీ పరిధిలోని కూర్నిపల్లి, కొత్త ఇండ్లు, చీళ్లవారిపల్లి, వి.రామాపురం, తమ్మిరెడ్డిపల్లి గ్రామాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా ఉన్నాయని వివరించారు. సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ప్రసాదనాయుడు, మురళి, ఆనంద్, విజయ్ కుమార్, త్రిమూర్తి, చంద్రయ్య, పాండు, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

స్మార్ట్‌లాక్‌లు ఏర్పాటు చేసుకోవాలి



మీడియాతో మాట్లాడుతున్న సీఐ మల్లేష్‌యాదవ్, ఎస్‌ఐ వెంకటమోహన్

రామకుప్పం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): చోరీలను నిరోధించేందుకు ప్రతి ఒక్కరూ స్మార్ట్‌లాక్‌లను ఏర్పాటు చేసుకోవాలని కుప్పం గ్రామీణ సీఐ మల్లేష్‌యాదవ్, రామకుప్పం ఎస్‌ఐ వెంకటమోహన్‌లు కోరారు. శనివారం వారు మీడియాతో మాట్లాడుతూ రామకుప్పం మండల పరిధిలోని పలు ఆలయాలు, ప్రార్థనాలయాలకు దాతల సహకారంతో తాము స్మార్ట్‌లాక్‌లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రజలు కూడా తమ ఇళ్లకు, దుకాణాలకు, గోదాములకు స్మార్ట్‌లాక్‌లను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. అదేవిధంగా సీసీ కెమెరాలను కూడా అమర్చుకోవాలని సూచించారు. సారాతయారీ, విక్రయాలు, గంజాయి రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

ఎంఈవో శ్రీరాములు సేవలు ఆదర్శనీయం



శ్రీరాములును సన్మానిస్తున్న సహచరులు

సదుం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎంఈవో శ్రీరాములు సేవలు ఆదర్శనీయమని విశ్రాంత హెచ్‌ఎం కృష్ణారెడ్డి పేర్కొన్నారు. శనివారం సదుం, సోమల మండలాల ఎంఈవోగా విధులు నిర్వహిస్తున్న శ్రీరాములు ఉద్యోగ విరమణ కార్యక్రమం స్థానిక సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ నాలుగు దశాబ్దాల కాలంపాటు ఎంతో మంది విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు అంకిత భావంతో శ్రీరాములు పనిచేసినట్లు కొనియాడారు. అనంతరం పెద్దసంఖ్యలో ఉపాధ్యాయులు దుశ్శాలువలతో శ్రీరాములు దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సదుం, సోమల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘ నాయకులు, ఎస్‌టీయూ స్టేట్ కౌన్సిలర్ మోహన్ కుమార్ రెడ్డి, ఏపీసీపీఎస్‌ఈఏ అసోసియేషన్ ఉమ్మడి చిత్తూరు జిల్లా గౌరవాధ్యక్షులు, అన్నమయ్య జిల్లా అధ్య క్షులు పచ్చార్ల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య



శివప్రసాద్

పుంగనూరు రూరల్, నవంబరు30(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన శనివారం పుంగనూరులో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసులు కథనం మేరకు..పట్టణంలోని ఏవీరావువీధికి చెందిన కన్నయ్య కుమారుడు శివప్రసాద్(32) బార్బర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల కుటుంబ ఖర్చులు, తమ్ముడికి ఉద్యోగం కోసం పలువురి వద్ద అప్పులు చేశాడు. అప్పు ఇచ్చిన వారి నుంచి ఒత్తిడి పెరగడంతో ఉదయం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గుర్తించిన తల్లి లక్ష్మీదేవి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి అతడిని పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. డాక్టర్లు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ఎస్డీపీఐ అధ్యక్షుడిగా అన్వర్‌బాషా



ఎస్డీపీఐ నూతన కమిటీ ప్రతినిధులు

పుంగనూరు రూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎస్డీపీఐ పుంగనూరు నియోజకవర్గ నూతన అధ్యక్షుడిగా కెఎస్.అన్వర్‌బాషా ఎన్నికైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ ఘనీ, హాఫీజ్ ఫైరోజ్ తెలిపారు. శనివారం స్థానిక అంజుమన్ షాదీమహాల్‌లో నియోజకవర్గ పార్టీ అంతర్గత ఎన్నికలను నిర్వహించారు. అధ్యక్షుడిగా అన్వర్‌బాషా, ప్రధాన కార్యదర్శిగా యూనస్, సంయుక్త కార్యదర్శిగా జమీర్‌లాల్, కోశాధికారిగా ఫయాజ్, కౌన్సిలర్‌గా చాంద్‌బాషా, కమిటీ సభ్యులుగా ముబారక్, సిద్ధిక్, అతిక్‌బాషా, హానీఫ్, జబీ, ఏజాస్, మహబూబ్‌లను ఎన్నుకున్నారు. నూతన కమిటీని పూలమాలలు, శాలువలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్డీపీఐ నాయకులు, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీ ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వెంకటరమణ



పలమనేరు, నవంబరు30 : బీసీ ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పెద్దపంజాణి మండలం బొమ్మలకుంట గ్రామానికి చెందిన గడదేసి వెంకటరమణ నియమితులయ్యారు. ఆమేర కు రాష్ట్ర బీసీ ఫ్రంట్ అధ్యక్షులు అద్దంకి రమణమూర్తి, ప్రధాన కార్యదర్శి పూలే గోవిందస్వామి వెంకటరమణకు నియామక ఉత్తర్వులు పంపారు. బీసీల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని వెంకటరమణ తెలిపారు.

లక్ష్మీ నరసింహుడికి కార్తీకమాస పూజలు

కల్లూరు, నవంబరు (ఆంధ్రజ్యోతి): దేవళంపేటలో కొలువైన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శనివారం కార్తీకమాసం వేడుకలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. వివిధరకాల పుష్పాలతో అలంకృతుడైన స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదారులుగా చిన్నగొట్టిగల్లు మండలానికి చెందిన వాసవీ మహిళామండలి సభ్యులు వ్యవహరించారు. అర్చకులు అనంతకుమారాచార్యులు తీర్థప్రసాదాలు అందజేశారు.

95.64 శాతం మందికి పింఛన్ల పంపిణీ

పలమనేరు, నవంబరు30 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు మున్సిపాలిటీలో శనివారం 95.64 శాతం మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ రమణా రెడ్డి తెలిపారు. మున్సి పాలిటీ పరిధిలో 4595 మందికి గాను 4402 మందికి పంపిణీ చేశామని వివరించారు.

వర్షంలోనే పెన్షన్ల పంపిణీ

రొంపిచెర్ల, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒక్కరోజు ముందుగానే పెన్షన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. శనివారం 91.89 శాతం పింఛన్లు ఇచ్చినట్లు ఎంపీడీవో మధుసూదనరెడ్డి తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది వర్షంలోనూ పింఛన్లు అంద జేశారు.

దారి సమస్య పరిష్కరించండి

రొంపిచెర్ల, నవంబరు30, (ఆంధ్రజ్యోతి): మండలంలోని గానుగచింత పంచాయితీ ఎగువ, దిగువ జూపల్లె రైతులు దారి సమస్య పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను కోరినట్లు రైతులు ఈశ్వర నాయుడు, నాగేశ్వరనాయుడు మాట్లాడుతూ రెండు పల్లెలకు చెందిన 350 ఎకరాల పొలాలకు, పశువులు మేపడానికి అటవీ ప్రాంతానికి వెళ్లే కాలిబాటను గ్రామానికి చెందిన కల్లా కుమార్ నాయుడు ఆయన తమ్ముడు ఆక్ర మించారని వాపోయారు. 1008 సర్వే నెంబ రులో సుమారు 35 అడుగులు పొడవుమేర నాలుగు అడుగుల వెడల్పు ఉన్న దారిని ఆక్రమించారని పేర్కొన్నారు. ప్రస్తుతం దారిలేక పొలాలకు వెళ్లేందుకు అవస్థలు పడుతున్నామని విచారం వ్యక్తం చేశారు.

అభాగ్యులకు అల్పాహారం పంపిణీ



పలమనేరు, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): పలమనేరులో శనివారం ఉదయం నుంచే ముసురు పట్టుకోవడంతో పట్టణంలో పలు చోట్ల ఉన్న అభాగ్యులకు ఇక్కడి సామాజిక కార్యకర్త పగడాల మధుమోహన్‌రావు అల్పాహారం ప్యాకెట్లు అందజేశారు.

సంఘాల సభ్యులు ఆర్థికంగా ఎదగాలి

రామకుప్పం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆర్థికంగా ఎదగాలని టీడీపీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు కోరారు. శనివారం రామకుప్పం వెలుగు కార్యాలయంలో స్వయం సహాయక సంఘాల సభ్యులు చిరువ్యాపారాలను అబివృద్ధి ఎలా చేసుకోవాలన్న అంశంపై బెంగళూరుకు చెందిన ఈజీమార్ట్ సంస్థచే ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ. జనసేన నేతలు రాజసింహా, ఆనంద్, భాస్కర్ , వెలుగు ఏపీఎం శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

734 వీధికుక్కలకు వ్యాక్సినేషన్

పలమనేరు, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మున్సిపాలిటీలో శనివారం నాటికి 734 వీధికుక్కలను తిరుపతి అనిమల్ కేర్‌కు పంపి వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ చేయించినట్లు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు.

ఎడతెరపి లేని వాన



సోమలలో పొలాల వద్ద ఉన్న వరి కుప్పలు

సదుం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): తుపాను ప్రభావంతో మండలంలో శనివారం ఉదయం నుంచి రోజంతా ఎడతెరపి లేని జడివానతో సాధారణ జన జీవనం స్తంభించింది. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు బోసి పోయాయి. ఆర్టీసీ బస్సు సర్వీసులు కూడా ప్రయాణికులు లేక ఖాళీగా రాకపోకలు సాగించాయి. చలిగాలులు తీవ్రంగా ఉండడంతో ఇళ్ల నుంచి జనం బయటకు రాకపోవ డంతో దుకాణాలు సైతం కొనుగోలుదారులు లేక ఖాళీగా దర్శన మిచ్చా యి. భవన నిర్మాణ పనులు ఆగిపోవడంతో కూలీలు ఇళ్లకే పరిమితం అయ్యారు.

సోమల: తుపాను ప్రభావంతో శనివారం ఉదయం నుంచి సోమలలో జడివాన కురుస్తోంది. వర్షానికి జనజీవనం స్తంభించింది. వరి కోతలు చేసిన పంటలను పొలాల వద్దనే బండలపై నిల్వ చేశారు. టమోటా కోతలు ఆపేశారు. పొలాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు పాటిస్తున్నారు.

పెరిగిన చలి తీవ్రత

చౌడేపల్లె: ముసురు వానతో మండలంలో చలి తీవ్రత బాగా పెరిగింది. శనివారం ఉదయం నుంచి ముసురు వాన కురుస్తోంది. మధ్యాహ్నం నుంచి వర్షం తీవ్రత కొద్ది కొద్దిగా పెరుగుతోంది. వర్షం ప్రభావంతో చలి తీవ్రత బాగా పెరగటంతో ప్రజలు బయటకు రావాలంటే ఇబ్బంది పడుతున్నారు. వ్యవసాయ పనులు ఎక్కడివక్కడే నిలిచి పోయాయి. సాయంత్రం 4 గంటల వరకు 18.4 మి.మీల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ హనుమంతు పేర్కొన్నారు.

రోజంతా ముసురు

వి.కోట: ఫెంగల్ తుపాను కారణంగా వి.కోటలో శనివారం రోజంతా ముసురువానతో జనం ఇబ్బంది పడ్డారు. ఉదయం 5 గంటల నుంచి చిరుజల్లులు కురవగా, ఆపై కాసేపు వర్షం తెరపి ఇచ్చింది. తిరిగి 11 గంటలకు మొదలైన వాన రోజంతా కురుస్తూనే ఉంది. వానకు భారీ ఈదురుగాలులు తోడవ్వడంతో బయట తిరిగేందుకు జనం ఇబ్బంది పడ్డారు. మండల పరిధిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ పార్వతి సూచించారు.

కుప్పంలో మోస్తరు వర్షం

కుప్పం: కుప్పంలో ఓ మోస్తరు వర్షం కురిసింది. మధ్యాహ్నం నుంచి చిరు జల్లులుగా మొదలైన వాన, రాత్రి దాకా ఓ మోస్తరుగా పడుతూనే ఉంది. చలిగాలులు తీవ్రంగా వీచాయి. చాలావరకు జనం ఇళ్లలోనే ఉండిపోయారు.

ప్రకృతి సేద్యంతోనే అధిక దిగుబడులు



టమోటా తోటను పరిశీలిస్తున్న ఆర్గానిక్ శాస్త్రవేత్త రమేశ్ రెడ్డి

సోమల, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పంటలు సాగుచేస్తే అధిక దిగుబడులు సాధించ వచ్చునని బెంగళూరుకు చెందిన ఆర్గానిక్ శాస్త్రవేత్త రెడ్డిపల్లె రమేశ్‌రెడ్డి తెలిపారు. శనివారం సోమలలోని పలు టమోటా, మిరప, మామిడి తోటలను ఆయన సంద ర్శించారు. ఇటీవల వర్షాలతో దెబ్బతిన్న తోటలకు వ్యాపించిన చీడపీడల నివారణ పద్ధతులను వివరించారు. రసాయన మందుల విని యోగం తగ్గించాలని సూచించారు. మామిడి తోటలను పరిశీలించి వేస్ట్ డీకంపోజర్, నీమ్ ఆయిల్ స్ప్రే చేయడంతో పలు లాభాలు ఉంటాయని, తక్కువ ఖర్చుతో ఆరోగ్యకరమైన పంటలను దిగుబడులు చేయాలని తెలిపారు. కూరగాయ సాగులలో రైతులు పాటించాల్సి పద్ధతులు వివరించారు. తక్కువ ఖర్చుతో బీజామృతాలు, ఘనజీవామృతం, పంచగవ్య తదితర విధానాలపై అవగాహన కల్పించారు. పండు ఈగల నివారణపై పలు సూచనలు చేశారు. ఆయన వెంట రైతు సంఘ నాయకులు నాగరాజ, శెట్టివారి మోహన్, సుధాకర్, సురేంద్ర పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ క్రీడాకారిణికి చేయూత



రక్షితకు నగదు అందిస్తున్న నారాయణరెడ్డి

పుంగనూరు రూరల్, నవంబరు30(ఆంధ్రజ్యోతి): జమ్మూ కాశ్మీర్‌లో జరిగే జాతీయ ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొనేందుకు వెళ్లే విద్యార్థినికి టీడీపీ నేత నారాయణరెడ్డి శనివారం రూ.5వేలు ఆర్థికసాయం అందించినట్లు పాఠశాల హెచ్‌ఎం శ్రీదేవి తెలిపారు. పుంగనూరు మండలం చంద్రమాకులపల్లె జడ్పీ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని రక్షిత ఫుట్‌బాల్ క్రీడల్లో ప్రతిభ కనబరచి జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. పోటీలకు వెళ్లేందుకు ప్రయాణ ఖర్చులకు ఆయన ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పీడీ మురళీధర్, ఉపాధ్యాయులు జ్యోతిశైలజ, శంకర్‌రెడ్డి, సుజాత పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న దళిత నాయకుడు శ్రీనివాసులు

పుంగనూరు రూరల్, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని దళిత సంఘనాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాము అధ్య క్షతన జరిగిన ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశంలో సంఘ నాయకుడు శ్రీనివాసులు మాట్లాడారు. డ్వాక్రా సంఘాలలో అభయహస్తం పథకం ద్వారా వసూళ్ల చేసిన డబ్బు ఎక్కడుందని ప్రశ్నించారు. స్త్రీనిధి రుణాలు చెల్లింపు వివరాలు అధికారులు, సిబ్బంది చెప్పకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆరోపించారు. దళిత నాయకుడు రామయ్య మాట్లాడుతూ సమావేశాన్ని ప్రతి నెలా నిర్వహించాలని కోరారు. ఎంపీడీవో లీలామాధవి, అధి కారులు, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణానాయక్, నాయకులు జీవనజ్యోతి, అశోక్‌కుమార్, నరసింహులు, మధుబాబు, చిన్నబ్బ పాల్గొన్నారు.

కథలు వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతాయి



కథల పుస్తకం ఆవిష్కరిస్తున్న రచయితలు

పలమనేరు, నవంబరు30 (ఆంధ్రజ్యోతి) : కథలు వ్యక్తిత్వాన్ని తీర్చి దిద్దు తాయని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసినాథంనాయుడు పేర్కొన్నారు. శనివారం స్థానిక బాలికల గురుకుల పాఠశాలలో డాక్టర్ హరికిషన్ రచించిన 'చిలకముక్కు చిన్నోడు' కథల పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల్లో కథలు చదివే అలవాటును తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీఐ భాస్కర్ మాట్లాడుతూ చిన్న తనంలో కథలు, పద్యాలు నేర్చుకొంటే పెద్దయ్యాక విలువలతో కూడిన జీవితం అలవడుతుందని పేర్కొన్నారు. మరో అతిథి రచయిత పలమనేరు బాలాజి మాట్లాడుతూ డాక్టర్ హరికిషన్ తన 75వ పుస్తకాన్ని తులసినాథం నాయడుకు అంకితం ఇవ్వడం గొప్ప విషయమన్నారు. నిరంతరం చదివే అలవాటు ఉన్నవారు ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని ఆయన పేర్కొన్నారు. అనంతరం రచయిత హరికిషన్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి, మాధవ్‌రెడ్డి, ఆనందబాబు, వేణుగోపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రశాంతి, సంస్థ కార్యదర్శి పుష్ప, శ్రీనివాసులు, కన్నయ్యానాయుడు, ధనంజయ, తాతయ్య తదితరులు పాల్గొన్నారు.

వానైనా..సెలవైనా..!



వృద్ధురాలికి పింఛను అందజేస్తున్న పీఎస్‌ఎం

కుప్పం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 1వ తేదీ ఆదివారం సెలవుదినం కావడంతో నవంబరు నెలాఖరు రోజైన 30వ తేదీ శనివారమే సామాజిక పింఛన్ల పంపిణీ చేశారు. కుప్పంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్.మునిరత్నం మొదలు, పంచాయతీ, సచివాలయ సిబ్బంది వాన కురుస్తున్నా పింఛన్లను పంపిణీ చేశారు. కంగుంది పంచాయతీలోని మారుమూల పల్లెల్లో పీఎస్‌ఎం పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్‌తో కలిసి 24వ వార్డులో పింఛన్లు పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు పురపాలక సంఘం పరిధిలోను, ఎంపీడీవో సాయి లహరి మండలంలోని కొన్ని గ్రామాలలోనూ పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. సాయం త్రానికి సుమారు 90 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయిందని అధికారులు ప్రకటించారు.

ఎయిడ్స్‌పై అవగాహన ఉండాలి

పలమనేరు/ బైరెడ్డిపల్లి నవంబరు30 (ఆంధ్రజ్యోతి): పలమనేరులో, బైరెడ్డిపల్లి మండలం తీర్థం గ్రామంలో శనివారం ఎయిడ్స్‌పై అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించారు. పలమ నేరు ప్రభుత్వ డిగ్రీకళాశాలలో రెడ్‌రిబ్బన్‌క్లబ్, ఎన్‌ఎస్ఎస్, ఎన్‌సీసీ సంయుక్తంగా విద్యార్థుల సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహు మతులు ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో ప్రిన్సి పాల్ వెంకటేశులు, వైస్ ప్రిన్సిపాల్ షన్ముగం, విజయశంకర్, అధ్యాపకులు చిదంబరం, నవనీశ్వరయ్య, ఐక్యు కో-ఆర్డినేటర్ బెనర్జీ, ఎన్‌ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వెంకటేష్‌బాబు, ఎన్‌సీసీ అధికారి బాలాజి పాల్గొన్నారు.

- బైరెడ్డిపల్లి మండలం తీర్థం గ్రామంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులతో ఎయిడ్స్‌డే సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పద్మావతి, హెచ్‌ఎం రత్నమ్మ, హెచ్‌ఈ కాంతమ్మ, హెచ్‌ఎస్ శ్రీదేవి, రాజారెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీఎస్ పూర్ణ, బే బి, ఉపాధ్యాయులు, ఆశాలు పాల్గొన్నారు.

చౌడేపల్లె: ఎయిడ్స్ వాధిని నిర్మూలిద్దాం అని డాక్టర్ పవన్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక జూనియర్ కాలేజిలో ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు హెచ్ఐవీ నివారణపై అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు బాలాజి, విద్యార్థులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.





చౌడేపల్లె, బైరెడ్డిపల్లె మండలం తీర్థం గ్రామంలో నిర్వహిస్తున్న ర్యాలీ

హెచ్‌ఎంలకు ముగిసిన శిక్షణ



కడా పీడీ ప్రసంగాన్ని ఆలకిస్తున్న హెచ్‌ఎంలు

కుప్పం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గుడుపల్లె మండల పరిధిలోని అగస్త్య ఫౌండేషన్‌లో రెసిడెన్షియల్ స్కూల్ లీడర్షిప్ ప్రోగ్రాం పేరుతో ప్రధానోపాధ్యాయులకు వారం రోజులపాటు నిర్వహించిన శిక్షణ శనివారంతో పూర్తయింది. ముఖ్య అతిథిగా హాజరైన కడా పీడీ వికాస్ మర్మత్, ప్రధానోపాధ్యాయులను ఉద్దేశించి ప్రసంగించారు. భావితరాలను బాధ్యత గల పౌరులుగా తీర్చిదిద్దాలని కోరారు. అగస్త్య ఫౌండేషన్ రామ్‌జీ రాఘవన్, ఎంఈవో శ్రీదేవి పాల్గొన్నారు.

రింగ్ రోడ్డు నిర్మాణం పూర్తిచేస్తాం

కుప్పం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కుప్పం చుట్టూ అసంపూర్తిగా మిగిలి పోయిన రింగ్ రోడ్డును పూర్తి చేయడానికి చర్యలు తీసుకుం టామని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ హామీ ఇచ్చారు. ఆయన శనివారం మున్సిపల్ టీడీపీ అధ్యక్షుడు రాజ్‌కుమార్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ జిమ్ దాముతో కలిసి వడ్డెపల్లె సమీపంలో అసంపూర్తిగా ఆగిన రింగ్ రోడ్డును పరిశీలించారు. సీఎం చంద్రబాబుతో మాట్లాడి నిధులు మంజూరు చేయించడానికి కృషిచేస్తానని చెప్పారు.

పంటల బీమా చేసుకోండి

సోమల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రబీ 2024 సీజన్‌లో వేరుశనగ, వరిపంటలు సాగు చేసిన రైతులు పీఎం ఫసల్ బీమా యోజన పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఏవో సుధాకర్ తెలిపారు. పంటలకు ఇన్సూరెన్స్ చేయించు కోవాలని కోరారు. రైతులు తమ ఆధార్ కార్డు, పాస్ బుక్, బ్యాంకు అకౌంట్, రైతు సేవా కేంద్రంలో ఇచ్చిన క్రాప్ బుకింగ్ సర్టిఫికెట్, ఫోన్ నెంబర్‌లతో రైతు సేవా కేంద్రంలో ఈ నెల 15 లోపు పంటల బీమా చేయించుకోవాలని తెలియజేశారు.

ఎయిడ్స్ రహిత సమాజం నిర్మిద్దాం

గుడుపల్లె, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ రహిత సమాజం నిర్మిద్దామని ప్రిన్సిపాల్ వెన్నెల పేర్కొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్‌ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శనివారం జూనియర్ కళా శాలలో ఎయిడ్స్ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులు గుడుపల్లె రైల్వే క్రాస్ నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రమేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

95 శాతం పింఛన్ల పంపిణీ

చౌడేపల్లె, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): జడివానలోనూ 95శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో లీలామాధవి పేర్కొన్నారు. మండలంలో 6592 మందికి గాను 6247 మందికి పింఛన్లు పంపిణి చేసినట్లు వివరించారు.

పుంగనూరు రూరల్: మండలంలోని



మంగళం గ్రామంలో టీడీపీ మండల అధ్యక్షుడు మాధవరెడ్డి సచివాలయ సిబ్బందితో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు.

ముమ్మరంగా టీడీపీ సభ్యత్వం

పుంగనూరు, నవంబరు30(ఆంధ్రజ్యోతి): పుంగనూరులో టీడీపీ సభ్యత్వం ముమ్మరంగా సాగుతున్నట్లు టీడీపీ మైనార్టీ నాయకుడు సుహేల్‌బాషా తెలిపారు. శనివారం పట్టణంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాల్లో పాల్గొని పార్టీ శ్రేణుల్లో చైతన్యం తెచ్చారు.

రైతులు పంటల బీమా చేసుకోవాలి

గుడుపల్లె, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు రబీ సీజన్‌కు సంబంధించిన వరి, వేరుశనగ, టమోట పంటలకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏవో నాగరాజు తెలిపారు. వివరాలకు రైతు సేవా కేంద్రాలలో సంప్రదించాలని పేర్కొన్నారు.

మొరవ పారుతున్న చెరువులు




మొరవ పారుతున్న పాతార్కాడు చెరువు - పాతార్కాడు వీధిలో వర్షపునీటి ప్రవాహం

విజయపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం ఉదయం నుంచి ఈదురుగాలులతో కూడిన ఎడతెరిపిలేని వాన కురవడంతో జనజీవనం స్తంభించింది. పొలాల్లోకి భారీగా వర్షపునీరు చేరింది. మంగళం, పన్నూరు, పాతార్కాడు, ఇళ్లత్తూరు, మహవీరపురం చెరువులైతే నిండు కుండలా మారి.. మొరవ పారుతున్నాయి. ఇక కోసలనగరం, పాతార్కాడులోని వీధుల్లో వర్షపునీరు జోరుగా ప్రవహిస్తోంది. కాగా, అత్యవసరమైతే విజయపురంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ (నెంబరు: 96666 89468)కు ఫోన్ చేయాలని ప్రజలకు తహసీల్దార్ కిరణ్ ఒక ప్రకటనలో సూచించారు.

ఆగని వాన

నగరంలో ఇబ్బంది పడ్డ జనం

చిత్తూరు అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నగరంలో శనివారం ఉదయం నుంచే చిరుజల్లులతో ప్రారంభమైన వాన ఆగకుండా సాయంత్రం వరకు కురుస్తూనే ఉంది. దీనివల్ల కూలీలు, చిరు వ్యాపారులు ఇబ్బంది పడ్డారు. విద్యార్థులైతే పాఠశాలలు, కళాశాలలు వెళ్లి, వచ్చే సమయంలో తడిచారు. ఓ మోస్తరు వానకే లోతట్టు ప్రాంతాల్లోని రోడ్లపైకి కాలువల్లోని మురుగు ప్రవహించి, దుర్గంధం వెదజల్లింది. చాలాచోట్ల షార్ట్‌సర్క్యూట్ కారణంగా విద్యుత్ లైన్లు మరమ్మతులకు గురవడంతో రిపేరు చేయడానికి సిబ్బంది తీవ్ర అవస్థలు పడ్డారు.



యూరియా తీసుకెళుతున్న రైతు



ట్రాక్టర్ మరమ్మతు చేస్తున్న మెకానిక్‌కు గొడుగుతున్న మహిళ

లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన కమిషనర్

● కంట్రోల్ రూమ్ నెంబరు: 98499 07885

చిత్తూరు అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశించారు. శనివారం ఉదయం నుంచి కురుస్తున్న వర్షాలతో లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. నీవానది పరివాహక ప్రాంతాలైన వీరభద్రకాలనీ, తేనబండ, కైలాసపురం ప్రాంతాల్లో పర్యటించి.. పరిస్థితిని సమీక్షించారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో పనిచేయడానికి రెస్క్యూ బృందాన్ని ఏర్పాటు చేశారు. నగరపాలక కార్యాలయంలో 24 గంటలు పనిచేసేలా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, 98499 07885 నెంబరును కేటాయించారు. కమిషనర్ వెంట డీఈలు వెంకటరమణ, శ్రావణి తదితరులున్నారు.

నీవానదిని పరిశీలిస్తున్న కమిషనర్ నరసింహ ప్రసాద్



ఐరాలలో ఈదురు గాలులు

నేలవాలిన వరిపంట

ఐరాల, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం ఉదయం నుంచే ఈదురుగాలులతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. గాలులు వీస్తుండటంతో చలికి జనం వణికిపోయారు. జల్లులు కురుస్తుండటంతో చిరువ్యాపారులు ఇబ్బందిపడ్డారు. అక్కడక్కడా వరి పంట నేలవాలింది.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రభుత్వ విప్ థామస్

వెదురుకుప్పం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): తుపాను నేపథ్యంలో గంగాధరనెల్లూరు నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

స్తంభించిన జనజీవనం: జడివానతో కార్వేటినగరం, వెదురుకుప్పం మండలాల్లో జనజీవనం స్తంభించింది. చాలా మంది ఇళ్లకే పరిమితమయ్యారు. ఈదురుగాలులతో చలి తీవ్రత ఎక్కువైంది.

నింద్ర: అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శేషగిరి రావు ఆదేశించారు. శనివారం అన్ని శాఖల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా తుపానుపై సమీక్షించారు. తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

యాదమరి: తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ (నెంబరు:94910 77020) ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ పార్థసారథి తెలిపారు. అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

సురక్షిత ప్రాంతాలకు యానాదుల తరలింపు

పాలసముద్రం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వనదుర్గాపురం యానాది కాలనీలో పూరిగుడిసెల్లోని వెంకటమ్మ, సరోజమ్మ కుటుంబీకులు ఏడుగురిని రెవెన్యూ అధికారులు సురక్షిత ప్రాంతానికి తరలించారు. చలి పెరగడంతో టీఎ్‌సఆర్‌పురంలోని చిరంజీవికి చెందిన కోడెదూడ మృతి చెందిందని గ్రామస్తులు తెలిపారు. తహసీల్దార్ అరుణకుమారి తన కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి సహాయక చర్యలను పర్యవేక్షించారు.

నగరిలో విరిగిపడ్డ ఫ్లెక్సీలు

నగరి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గాలివానకు నగరి టవర్ క్లాక్ వద్ద ఫ్లెక్సీలు విరిగిపడ్డాయి. పలు వీధులు జలమయం అయ్యాయి. మండలంలో అక్కడక్కడా చెట్లు కూడా నేలకొరిగాయి. ఇక తుపాను నేపథ్యంలో ప్రత్యేక కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేసినట్లు నగరి ఆర్డీవో భవానిశంకరి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం డీటీ గౌరీశంకర్, నింద్ర వీఆర్‌ఏ భూపాల్ కంట్రోల్‌రూమ్‌లో అందుబాటులో ఉంటారన్నారు. అత్యవసర పరిస్థితుల్లో 94918 03680 నెంబరును సంప్రదించాలని సూచించారు. సోమవారం డీటీలు రూపశ్రీలక్ష్మి, విజయ్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ భూదేవి పర్యవేక్షిస్తారని 95025 27667 నెంబరుకు ఫోన్ చేయాలన్నారు.



టవర్‌క్లాక్ వద్ద



జలమయమైన నగరిపేట వీధి

తవణంపల్లెలో బోసిపోయిన ప్రభుత్వ కార్యాలయాలు

తవణంపల్లె, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో జోరువాన కురుస్తుండటంతో జనం ఇళ్లకే పరిమితమయ్యారు. అరగొండ, తవణంపల్లె, క్రాస్ రోడ్డు తదితర గ్రామాల్లో దుకాణాలు బోసిపోయాయి. ప్రభుత్వ కార్యాలయాల వద్ద జనం కనిపించలేదు.



వర్షంలోనూ పింఛన్ల పంపిణీ

పాలసముద్రం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వర్షం కురుస్తున్నా ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను లబ్ధిదారులకు సచివాలయ సిబ్బంది పంపిణీ చేశారు. పాలసముద్రం మండలంలో 3,615 మందికిగాను సాయంత్రానికి 3,256 మందికి పింఛను సొమ్ము అంజేశారు. ఎంపీడీవో కృష్ణమహేష్‌రెడ్డి, ఈవోపీఆర్డీ రమేష్ పర్యవేక్షించారు.

వెదురుకుప్పం: కార్వేటినగరం మండలంలో 94 శాతం పింఛన్లు పంపిణీ చేశారని ఎంపీడీవో టి.చంద్రమౌళి తెలిపారు. వెదురుకుప్పం మండలంలో 92 శాతం పెన్షన్ల పంపిణీ జరిగిందని ఎంపీడీవో అమరనాథ్ తెలిపారు. సచివాలయ ఉద్యోగులు, టీడీపీ నాయకులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

విజయపురం: మండలంలో 5082 పింఛన్లనకు 4707 పంపిణీ చేసినట్టు ఎంపీడీవో రమణప్రకాష్ తెలిపారు. మిగిలిన వారికి సోమవారం పంపిణీ చేస్తామన్నారు.

ఆస్పత్రుల్లోని బాధితులకు..



గంగిరెడ్డికి పింఛను సొమ్ము ఇస్తున్న సురేఖ



వెంకట్రామయ్యకు పింఛను సొమ్ము అందజేస్తున్న నీలిమ

పెనుమూరు: మండలంలో 7198 మందిలో 6660 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి తెలిపారు. సీఆర్ కండ్రిగ గ్రామానికి చెందిన గంగిరెడ్డి అనారోగ్య కారణంగా చిత్తూరు ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. దీంతో సెక్రటరీ సురేఖ ఆస్పత్రికెళ్లి ఆయనకు పింఛను సొమ్ము అందజేశారు..

గుడిపాల: నెల్లూరు జిల్లా ఆలూరుకు చెందిన దివ్యాంగుడు వెంకట్రామయ్య అనారోగ్యంతో బాధపడుతూ తమిళనాడు రాష్ట్రం కరిగిరి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈనెల పింఛను అందుకోవడానికి నెల్లూరు జిల్లాకు వెళ్లలేని పరిస్థితిలో ఉన్నాడు. అదే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గుడిపాల మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్‌కు ఈ విషయం గమనించాడు. దీంతో నెల్లూరు అధికారులకు సమస్యను తెలియజేశాడు. స్పందించిన అధికారులు నంగమంగళం సచివాలయ సెక్రటరీ నీలిమ ద్వారా పింఛను సొమ్మును వెంకట్రామయ్యకు అందజేశారు. దీంతో చంద్రమోహన్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు వెంకట్, సునీల్ పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ చేసిన చుడా చైర్‌పర్సన్

చిత్తూరు అర్బన్: చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత నగరంలోని 33వ డివిజన్‌లో ఇంటింటికీ వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు. స్థానిక నేతలు పాల్గొన్నారు.



సంక్షిప్తంగా..

గురజాడ సేవలు మరువలేనివి

చిత్తూరు సెంట్రల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తెలుగుభాష, సాహిత్యానికి గురజాడ అప్పారావు చేసిన సేవలు మరువలేనివని ఎన్‌పీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల తెలుగుశాఖ అధ్యక్షులు ఉషారాణి కొనియాడారు. శనివారం కళాశాలలో గురజాడ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. పలమనేరు డిగ్రీ కళాశాల అధ్యాపకులు వాసుదేవరెడ్డి, ధర్మమూర్తి ప్రసంగించగా, విద్యార్థినులు పాల్గొన్నారు.

సీఐ బదిలీ

చిత్తూరు అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు పోలీసు కార్యాలయంలో వీఆర్‌లో ఉన్న సీఐ ఉలసయ్య బదిలీ అయ్యారు. ఇదివరకు రెండో పట్టణ సీఐగా ఉన్న ఉలసయ్యను ప్రభుత్వం వీఆర్‌కు తీసుకుంది. శనివారం ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో భాగంగా ఆయన్ను కడపజిల్లా ఆర్కేవ్యాలీకి పంపింది.

రూ.2.80లక్షల జరిమానా

చిత్తూరు అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలను నడిపిన 28 మందికి కోర్టు జరిమానా విధించింది. శుక్రవారం ట్రాఫిక్ పోలీసులు వివిధ ప్రాంతాల్లో వాహనాల తనిఖీ చేశారు. 28 మంది మద్యం తాగినట్లు గుర్తించి, కేసు నమోదు చేశారు. శనివారం వీరిని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి రమాదేవి ముందు హాజరు పరిచారు. ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున 28 మందికి రూ.2.80లక్షల జరిమానా విధించారు.

వేణుగోపాలుడికి క్షీరాభిషేకం

వెదురుకుప్పం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): దేవరగుడిపల్లె-ఆడారెడ్డిపల్లె సమీపంలో ఉన్న వన వేణుగోపాలస్వామికి శనివారం క్షీరాభిషేకం నిర్వహించారు. స్వామికి ప్రధాన అర్చకుడు కె.కార్తీక్ అయ్యంగార్ ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. ఏర్పాట్లను ప్రధాన కార్యనిర్వాహకుడు శివకుమార్ పర్యవేక్షించారు.

అంకాల పరమేశ్వరికి పూజలు: కార్వేటినగరంలోని అంకాల పరమేశ్వరి అమ్మవారికి శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం

బంగారుపాళ్యం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా అరవింద్ బాబు, గౌరవ అధ్యక్షుడిగా ప్రతాప్ సేన్, ప్రధాన కార్యదర్శిగా శివశంకర్, కోశాధికారిగా శంకరన్, ఉపాధ్యక్షులుగా రామచంద్ర, ఉమాపతి, సంయుక్త కార్యదర్శిగా చాంద్ బాషా, బాలయ్య, జ్యోతినాథ్ ఎన్నికయ్యారు.

అఘోర పాశుపతాస్త్ర హోమం



చిత్తూరు కల్చరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గిరింపేట శివగామి సుందరి సమేత చిదంబరేశ్వర ఆలయంలో శనివారం కార్తీక మాస అమావాస్య సందర్భంగా అఘోర పాసుపతాస్త్ర హోమం నిర్వహించారు. స్వామిని ఏఎస్పీ రాజశేఖర్‌రాజు, భక్తులు దర్శించుకున్నారు.

తూతూ మంత్రంగా మండల మీట్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గీత

చిత్తూరు రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం తూతూమంత్రంగా జరిగింది. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన సమావేశాన్ని రెండు గంటల్లోనే ముగించారు. అభివృద్ధి పనులపై ఎటువంటి చర్చా జరగలేదు. చిత్తూరు ఎంపీపీ గీత, ఎంపీడీవో శ్రీనివాసులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ



కార్వేటినగరంలో విద్యార్థుల ర్యాలీ

వెదురుకుప్పం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా శనివారం కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు ర్యాలీ నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్, రెడ్ రిబ్బన్ క్లబ్, యూత్ రెడ్ క్రాస్ సొసైటీ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సీతా విజయులురెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ పీవో డాక్టర్ ధనంజయరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

పెనుమూరు: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఇన్చార్జి ప్రిన్సిపాల్ శారద, అధ్యాపకులు పాల్గొన్నారు.

600 లీటర్ల సారా ఊట ధ్వంసం

వెదురుకుప్పం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం ప్రొహిబిషన్, ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో శనివారం ఎక్సైజ్ పోలీసులు, టాస్క్‌ఫోర్సు సంయుక్తగా దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో ఎస్ఆర్‌పురం మండలం చిన్నతయ్యూరు సమీపంలో 600 లీటర్ల ఊటను ధ్వంసం చేశారు. టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ అశోక్, ఎక్సైజ్ ఎస్ఐ మోసెస్, సిబ్బంది దాడుల్లో పాల్గొన్నారు.



డిగ్రీ కళాశాల పేరు మార్పు చేస్తారా?

వెదురుకుప్పం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పేరు మార్పు చేస్తారా? అన్న చర్చ జరుగుతోంది. వైసీపీ పాలనలో 2020-21 విద్యా సంవత్సరంలో వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరైంది. తాత్కాలికంగా చవటగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డిగ్రీ తరగతులను ప్రారంభించారు. కాగా, డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి కొమరగుంట రెవెన్యూ లెక్కదాఖలా సర్వే నెంబరు-247/1,2,3,4,5,6,10లో ఎనిమిది ఎకరాల 44 సెంట్లు స్థలాన్ని కేటాయించారు. భవన నిర్మాణానికి రూ.15 కోట్లు మంజూరు చేసినట్లు కాగితాలకే పరిమితమైంది. ఇప్పటివరకు పునాది రాయి పడలేదు కానీ ఇక్కడ వైఎస్ విగ్రహాన్ని మాత్రం ఏర్పాటు చేశారు. ఈ పరిస్థితుల్లో కళాశాలకు వైఎస్ఆర్ అన్న పదం కొనసాగిస్తారా? లేదా? అన్న చర్చ జోరందుకుంది.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి: మేయర్



స్టాల్స్ పరిశీలనలో అముద, నరసింహ ప్రసాద్ తదితరులు

చిత్తూరు అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా ఎదగాలని మేయర్ అముద పిలుపునిచ్చారు. చిత్తూరు నగరపాలక సంస్థ, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) సంయుక్త ఆధ్వర్యంలో గిరింపేటలో ఏర్పాటు చేసిన మెప్మా అర్బన్ మార్కెట్‌ను శనివారం మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, కమిషనర్ నరసింహ ప్రసాద్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్వయం సహాయక మహిళా సంఘాలు సమన్వయంతో పనిచేసి వ్యాపారాలను విజయవంతంగా నిర్వహించాలన్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన 40 స్టాల్స్ సందర్శించారు. సీఎంఎం రమణ, సీవోలు, ఆర్పీలు, పాల్గొన్నారు.

విద్యార్థులకు పక్కాగా స్క్రీనింగ్ టెస్టులు: కమిషనర్

చిత్తూరు అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యార్థులకు ఆర్‌బీఎస్‌కే స్క్రీనింగ్ టెస్టులను పక్కాగా చేయాలని కమిషనర్ నరసింహ ప్రసాద్ అన్నారు. శనివారం శరవణపురం అంగన్వాడీ కేంద్రంలో జరుగుతున్న స్క్రీనింగ్ టెస్టును ఎంహెచ్‌వో డాక్టర్ లోకేష్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్ తదితరులు

ఐరాల(కాణిపాకం), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వరసిద్ధుడి ఆలయానికి సంబంధించి 2025 క్యాలెండర్లను తన నివాసంలో ఎమ్మెల్యే మురళీమోహన్ శనివారం ఆవిష్కరించారు. ఆలయం వద్ద స్టాల్‌లో త్వరలోనే క్యాలెండర్లను విక్రయించనున్నారు. ఆలయ ఈవో గురుప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షుడు గిరిధర్‌బాబు, నాయకులు గంగారపు హరిబాబునాయుడు, మధుసూదన్‌రావు, హేమాద్రినాయుడు, నరసింహులునాయుడు, బాబునాయుడు పాల్గొన్నారు.

మంగళ విద్యావాణి 31వ సంచిక ఆవిష్కరణ

బంగారుపాళ్యం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మంగళపల్లె పాఠశాలలో విద్యార్థులతో నిర్వహిస్తున్న 31వ మంగళ విద్యావాణి సంచికను హెచ్ఎం రాజ్యలక్ష్మి, అమృత భారతి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రకాష్ రెడ్డి, ప్రముఖ అవధాని ఆముదాల మురళి శనివారం ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు అరుణశివప్రసాద్, రమాదేవి, పిళ్లారప్ప తదితరులు పాల్గొన్నారు.



వివేకంతో విజయం తథ్యం



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ఆముదాల మురళి

బంగారుపాళ్యం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యాభ్యాసంతోపాటు వివేకం పెంచుకుంటే జీవితంలో విజయం సాధిస్తారని విద్యార్థులకు ప్రముఖ సహస్రావధాని ఆముదాల మురళి సూచించారు. శనివారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అమృతభారతి ఫౌండేషన్ సౌజన్యంతో విద్యా సామగ్రితోపాటు స్వామి వివేకానంద రచనలతో కూడిన పుస్తకాలను పంపిణీ చేశారు. అమృతభారతి ఫౌండేషన్ నిర్వాహకులు ప్రకాష్ రెడ్డి, ఇన్చార్జి హెచ్ఎం జనార్దన్ రెడ్డి, టీచర్లు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా షణ్ముగం



కృష్ణయ్య నుంచి నియామక పత్రాన్ని అందుకుంటున్న షణ్ముగం

చిత్తూరు సెంట్రల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చిత్తూరు టౌన్ బ్యాంకు మాజీ చైర్మన్ షణ్ముగం ఎన్నికయ్యారు. శనివారం హైదరాబాదు విద్యానగర్‌లోని జాతీయ బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో జాతీయ అధ్యక్షుడు, మాజీ రాజ్యసభ్యుడు ఆర్.కృష్ణయ్య నుంచి నియమాక పత్రాన్ని అందుకున్నారు.

ఆహారం తయారీపై అవగాహన పెంచుకోండి

పెనుమూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆహారం తయారీపై అవగాహన పెంపొందించుకోవాలని విద్యార్థులకు జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం వెంకటేశులునాయుడు సూచించారు. శనివారం టైమ్స్ సెంటర్ ఫర్ లెర్నింగ్ లిమిటెడ్ వారి సౌజన్యంతో ఉపాధ్యాయుడు మోహన్.. 9వ తరగతి చదువుతున్న విద్యార్థులను చిత్తూరులోని ఆంధ్రాస్పైస్ హోటల్‌కు తీసుకెళ్లారు. ఆహార పదార్థాల తయారీపై అవగాహన కల్పించారు. యామిని, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గుంతలరోడ్లతో పొంచి ఉన్న ప్రమాదం



పానాటూరు వద్ద గుంతలమయమైన తారురోడ్డు

గుడిపాల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో కురుస్తున్న చిన్నపాటి వర్షానికే గుంతలమయమైన రోడ్లపై నీరు చేరడంతో ప్రమాదాలకు నిలయంగా మారాయి. సీకేపల్లె, రెట్టగుంట, మొగరాలపల్లె, వేల్‌రామ్‌బట్టి, గురుగునత్తం, చిత్తూరు-వేలూరు జాతీయ రహదారిలోని ఎంసీఆర్ క్రాస్, పానాటూరు, అనుపు వద్ద ఎక్కడ గుంత, ఎక్కడ మిట్ట తెలియక ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పానాటూరు రోడ్డులోని గుంతల కారణంగా గత నెల వ్యవధిలో జరిగిన ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందారు. ఇకనైనా ఈ గుంతలను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.